RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 162 ISSUE NO : 162 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం,డిసెంబర్,18,2025 Thursday,December,18,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



గజగజలాడుతున్న..

## తెలంగాణ

**7.4 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు**

- తెలంగాణను వణికిస్తున్న శీతల గాలులు
- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ రాష్ట్రాన్ని చలిపులి వణికిస్తోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రజలు గజగజలాడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో మంగళవారం అత్యల్పంగా 7.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో జనజీవనంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వివిధ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో 7.9 డిగ్రీలు, ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన శేరిలింగంపల్లిలో 10, మల్కాజిగిరిలో 10.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.



మోదీకి కారు డ్రైవర్‌గా మారిన

## ఇథియోపియా ప్రధాని

- ఇరు దేశాల చారిత్రక బంధాన్ని గుర్తుచేసిన ప్రధాని మోదీ
- 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని
- మోదీకి ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారం




ఢిల్లీ,: ప్రధాని నరేంద్ర మోదీ తన ఇథియోపియా పర్యటనలో భాగంగా ఈరోజు ఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. భారత్, ఇథియోపియా మధ్య వాతావరణంలోనే కాకుండా స్ఫూర్తిలోనూ సారూప్యత ఉందని అన్నారు. ఈ పర్యటన సందర్భంగా మోదీకి అరుదైన గౌరవం లభించింది.

అన్ని సంస్థల్లో 50 శాతం

## వర్క్ ఫ్రం హోం

**తీవ్ర కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక ఆదేశాలు**



ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని అల్లాడిపోతోంది. శీతాకాలం కావడంతో ఢిల్లీలో వాయు కాలుష్య సంక్షోభం తలెత్తింది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య కట్టడికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని అన్ని సంస్థలకు 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్‌ను తప్పనిసరి చేసింది. ఢిల్లీ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా 50 శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో పనిచేయాలని ఆదేశించింది.




తెలంగాణలో ముగిసిన..

## పంచాయితీ ఎన్నికలు

- మూడో విడతలో పలు చోట్ల స్వల్ప ఘర్షణలు
- ఉదయం నుంచే క్యూలో నిలబడ్డ ఓటర్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ నేపథ్యంలో పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. గ్రామాల్లో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రానుపోను కిరాయి డబ్బులు ఇచ్చి రప్పించారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్‌కొనసాగింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్యూలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. కాగా, మొదటి, రెండో విడతల ఎన్నికల మాదిరిగానే మూడో విడత తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. బుధవారం మూడవ విడతలో భాగంగా 3,752 గ్రామ పంచాయతీలకు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు.

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగాయి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది.

పోలింగ్ బూత్‌లో ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్లపై కాంగ్రెస్ పార్టీకి చెందినవారు దాడికి పాల్పడ్డారు. తమకు ఓట్లు వేయాలంటూ కాంగ్రెస్ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తుండటంతో బీఆర్ఎస్ ఏజెంట్లు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిని ఒకరు తోసుకున్నారు. దీంతో నలుగురు గాయపడ్డారు. ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు.. గాయపడిన వారిని పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇక రంగారెడ్డి జిల్లా మంచాల మండలం అస్మత్‌పూర్‌లో ఉద్రిక్తత నెలకొన్నది. కాంగ్రెస్ అభ్యర్థి పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెండు పార్టీల కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు.



సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు

## దిమ్మతిరిగే ఫలితాలు

- గ్రామపాలన పడకేయడంతో ఒటుతో సమాధానం
- తూప్రాన్ మండల సర్పంచ్‌లోతో హరీష్ రావు

**సిద్దిపేట,తెలంగాణ దిశ :**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని.. రేవంత్ రెడ్డికి మైండ్ బ్లాక్ అయిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డులు అన్నీ మూలకు పడ్డాయని తెలిపారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని అన్నారు.బుధవారం నాడు గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలనికి చెందిన పలువురు సర్పంచ్‌లను హరీష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని... ప్రజల తీర్పు చూసి కాంగ్రెస్ నాయకులకు షాక్ తగిలిందన్నారు. మొదటి దఫా ఫలితాలు చూసి షాక్ అయ్యారని..



జర్మనీలో రాహుల్

## పర్యటన

- మ్యూనిచ్‌లో బిండబ్ల్యూ ప్లాంట్ సందర్శప
- తయారీరంగం బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచన

బెర్లిన,:జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సీరిస్, బీఎండబ్ల్యూ ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించా రు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టిపెట్టాలంటూ కేంద్రప్రభుత్వానికి సూచించారు.



కాంగ్రెస్‌కు..

## డేంజర్ బెల్స్

**హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊరటను ఇస్తూనే, అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను కూడా జారీ చేశాయి. ఇప్పటివరకూ వెలువడిన రెండు విడతల ఫలితాలను పరిశీలి స్తే, అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ అగ్రస్థానంలో నిలి చిన మాట వాస్తవమే. కానీ, క్షేత్ర స్థాయిలో చోటుచేసుకున్న పరిణా మాలు, గణాంకాలను లోతుగా విశ్లేషి స్తే.. అధికార పార్టీ సాధించిన ఈ విజయం బలుపు కాదని, కేవలం వాపు మాత్రమేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపి స్తోంది.సాధారణంగా ఏ రాష్ట్రంలో నైనా అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి.**



కాంగ్రెస్‌కు అనుకూలంగా..

## పోలీసులు తీరు

- మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత
- కుటుంబ సభ్యులుతో కలసి ఓటేసిన మాజీమంత్రి

**మెదక్,తెలంగాణ దిశ :**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తూ బీఆర్ఎస్ మద్దతుదారుల సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేశారని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం స్థానిక ఎన్నికల సందర్భంగా స్వగ్రామమైన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనం తరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తం గా కాంగ్రెస్ నాయకులు పోలీసుల అండతో దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని మండిపడ్డా రు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయకపోగా.. గ్రామాల్లో ఓటర్లను మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని తమకు ఓటు వేయకపో తే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేద్దాం

## - పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 17 (తెలంగాణ దిశ) :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్ళపూడి కమాన్ వయా ఎల్లమ్మ బండ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న ప్రధాన రహదారి 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అధికారులతో కలి సిపిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, కార్పొరేటర్ తో కలిసి ఉషా ముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా వెళ్లి పనులను పరిశీలించారు. 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సరైన ప్రణాళికను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంబాలను తొలగించాలని, అదే విధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఎల్లమ్మబండ రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొందని, దీనిని దృష్టిలో ఉంచుకొని విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులుపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని ఆదేశించారు.

### బీటీ రోడ్డు, వరద నీటి కాలువ పనులను పరిశీలన

మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీ లో రూ.కోటి నలభై ఐదు లక్షల రూపాయల అంచన వ్యయంతో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి చైర్మన్ ఆరికెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. గోకుల్ ప్లాట్స్ కాలనీలో రూ.1 కోటి 45 లక్షల రూపాయల అంచన వ్యయంతో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. అసంపూర్తిగా మిగిలిపోయిన వరద నీటి కాల్వ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అగ్రభాగాన నిలబెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీఈ శ్రీదేవి, నాయకులు బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, సాంబయ్య, సంజీవ రెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం

## - నిధులు మంజూరు చేయాలి

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కొరత, ఉపాధ్యాయుల కొరత, కొన్ని పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని కొనసాగించేందుకు వంట గదుల కొరత, కొన్ని పాఠశాలలో మరుగు దొడ్ల కొరత, ఎంపిపిఎస్ వెస్లీ నాచారం పాఠశాలకు నూతన భవననిర్మాణం వంటి వాటిని మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందుగా ఈ సమస్యలను వివరించి వారి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ బి అజిత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఉప్పల్ నియోజకవర్గంలోని పాఠశాలలలో సదుపాయాల లేమిని, ఉపాధ్యాయుల కొరతను వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్ గారు, బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

(ఉప్పల్, తెలంగాణ దిశ)

# దశలవారీగా అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

## - కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17, (తెలంగాణ దిశ) :**నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో దశలవారీగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సూరారంలో పర్యటించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిహెచ్ఎంసి ద్వారా నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ కల్ప పరిధిలోని బ్లాక్ నంబర్లు 90, 96, 80, 85, 70, 78, 65,70, 40, 51, 49 ,54, అలాగే పోచమ్మ గుడి వరకు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సూరారం కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి జిహెచ్ఎంసి పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసినందుకు ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# 16వ డివిజన్ కు కుషాయిగూడ పేరు పెట్టాలి...






**కుషాయిగూడ, డిసెంబర్ 17, (తెలంగాణ దిశ)** :16 వ డివిజన్ కు కుషాయిగూడ పేరు ను పెట్టాలని బుధవారం కుషాయిగూడ పరిసర కాలనీలా సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో వినతి పత్రాలను సమర్పించారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ ఆఫీస్ లో విలేజ్ పత్రం సమర్పించారు .ఇందుకు మద్దతు తెలుపుతూ సీసీఎస్ అధ్యక్షులు, శివసాయి నగర్ కాలనీ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షులు యావపురం రవి, సాయినగర్ కాలనీ అధ్యక్షులు సారా వినోద్ ముదిరాజ్, వైష్ణవి ఎన్ క్లేవ్ అధ్యక్షులు గంప కృష్ణ గుప్త, ఇందిరానగర్ కాలనీ మాజీ అధ్యక్షులు సారా అనిల్ ముదిరాజ్ లు వారి వారి కాలనీల నుంచి 16వ డివిజన్కు కుషాయిగూడ పేరు పెట్టాలని కోరుతూ వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి చిత్తుల కిషోర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ నలచెరువు జనార్దన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్ల రాజు ముదిరాజ్ తదితరులు హాజరై వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నగరంలోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో వినతి పత్రాలను సమర్పించారు.

# ఘనంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17,(తెలంగాణ దిశ):** జీడిమెట్ల డివిజన్ ఎంఎన్ రెడ్డి నగర్ ఫేజ్-1లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కాశీ విశ్వేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో కాలనీ వాసులంతా ఒక్కతాటిపై ఉంటూ కాలనీ అభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధికి పాటుపడుతుండటం సంతోషకరమైన విషయమని,ఆకాశీ విశ్వేశ్వర స్వామిదయా,కృపాకటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ, కాలనీ వెల్ఫేర్అసోసియేషన్ ఛైర్మన్ ఎస్.గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.ఎస్. శంకర్, జి.భారతీ, టి. శివరామిరెడ్డి, దేవాలయ కోశాధికారి పి. రాము, లక్ష్మీ మోహన్, కాలనీ వాసులు, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, బిఆర్ఎస్ నాయకులుసంపత్ మాధవ రెడ్డి, కుంట సిద్ధిరాములు,గుమ్మడి మధుసూదన్‌రాజు,సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్,ఎల్లా గౌడ్, ఆటోబలరాం,సమ్మయ్య నేత, తోకల నగేష్ రెడ్డి, మధు,కాలేగణేష్, శ్రీకాంత్,బాల మల్లేష్, కుంట వేణు,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 17, (తెలంగాణ దిశ) :**జిల్లా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్, మండల తహాసీల్దార్ కార్యాలయాలకు కేటాయించే నిమిత్తం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. బుధవారం మేడ్చల్ మండలంలోని జిల్లా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్ లో, ప్రక్కనే ఉన్న ఎంపిడిఓ కార్యాలయాన్ని మండల తహాసీల్దారు కార్యాలయానికి కేటాయించే నిమిత్తం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ కార్యాలయంలోని రెండవ అంతస్తు భవనంలో పై కప్పు స్లాబ్ నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందని అంచనాలను వేసి నివేదిక పంపాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. అదే విధంగా ప్రక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో జి ప్లస్ వన్ కార్యాలయ నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందనే నివేదికలు పంపాలని సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని గదులను, మీటింగ్ హాల్ లను, ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని జిల్లా పరిషత్ సిఈఓ కాంతమ్మ కలెక్టరుకు చూపించి వివరాలు తెలిపారు. అనంతరం శామీర్ పేట్ లోని ఎంపిడిఓ కార్యాలయాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు .

# శరణు ఘోషతో మారుమోగిన అయ్యప్ప స్వామి ఆలయం

**మెట్టుగూడ,డిసెంబర్ 17, (తెలంగాణ దిశ):**

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనార్థం మంద తిరుపతి గురు స్వామి బృందం బుధవారం మెట్టుగూడ అయ్యప్ప స్వామి ఆలయం నుండి ఇరుముడి కట్టుకొని బయలుదేరారు. మండల దీక్ష పూర్తి చేసుకుని శబరిమల అయ్యప్ప దర్శనార్థం వెళ్లే భక్తులతో ఆలయ ప్రాంగణం శరణు ఘోషతో మారుమోగింది. ఈ సందర్భంగా తిరుపతి గురు స్వామి మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా అయ్యప్ప స్వామి మాల ధరిస్తూ శబరీషుని దర్శిం చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ గురుస్వామి శశికాంత్ స్వామి, రాహుల్ కన్నె స్వామి, ప్రకాష్ కన్నె స్వామిలు శబరి యాత్రకు వెళ్లిన వారిలో ఉన్నారు.



# ఈ నెల 21న మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్

**కుషాయిగూడ, డిసెంబర్ 17, (తెలంగాణ దిశ)** :జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 21 న కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్. శ్రీదేవి గారు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాల్లో జరిగే ఈ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులతో పాటు రాజీపడదగిన క్రిమినల్, వాహన ప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్కు బౌన్స్, భూ వివాదాల వంటి కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని సత్వర న్యాయాన్ని పొందాలని ఆమె సూచించారు.




# టమోటా ధరలకు రెక్కలు



**తిరుపతి,తెలంగాణ దిశ:**టమోటా ధరలకు రెక్కలు వచ్చాయి. ఉన్న పళంగా బంగారం లాగానే ధరలు పెరుగుతున్నాయి. మదనపల్లి మార్కెట్‌లో కిలో రూ.63 టమోటా ధర తలుకుతుండగా గత పది రోజులుగా క్రమేణ పె రుగుతున్నాయి. ఉమ్మడిచిత్తూరు జిల్లా లోని పడమటి మండలాల్లో ప్రధాన ఆదాయ పంటగా టమోటా సాగు చేస్తున్న రైతులు ధర ఉన్న దిగుబడి లేక దిగాలు చెందుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మదనప ల్లి,తంబళ్లపల్లి పుంగనూరు పలమనేరు నియోజకవర్గాల్లోనే దాదాపు 10 వేల హెక్టార్లలో టమోటా సాగు చేసిన రైతులు దిగుబడి కూడా ఆశాజనక ంగానే ఉంటుందని భావించారు. సీజన్ ముగుస్తున్న సమయంలో మొంథా తుఫాను, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది.

# సంపాదకీయం

## స్వతంత్ర ట్రిబ్యునల్...

భారత రాజ్యాంగం శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య అధికారాలను స్పష్టంగా విభజించింది. ఒకరి పరిధిలో మరొకరు జోక్యం చేసుకోకూడదన్నది మౌలిక సూత్రం. దీనినే మనం 'లక్ష్మణ రేఖ'గా చెప్పుకుంటున్నాం. అయితే, ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న పరిణామాలు ఈ రేఖను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో న్యాయస్థానాలు విధించే గడువులను, తమకున్న 'విచక్షణాధికారం' పేరుతో చట్టసభల అధిపతులు వ్యవహరిస్తున్న తీరు ఒక అంతులేని రాజ్యాంగ ప్రతిష్టంభనకు దారితీస్తోంది.ప్రస్తుతం ఈ ఘర్షణకు కేంద్ర బిందువు 'ఫిరాయింపుల నిరోధక చట్టం' అమలు. తెలంగాణలో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు. స్పీకర్ తీరును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయినా, స్పీకర్ గడువు పొడిగింపు కోరడం, పండుగలు, ఇతర కారణాలను చూపడం గమనార్హం.మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నా, ఫలితం ఒక్కటే. వైసీపీ ఎమ్మెల్సీలు తమ పదవులకు రాజీనామా చేసినా, శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు వాటిని ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచారు. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని డెడ్ లైన్ విధించింది.రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకునే సర్వాధికారం స్పీకర్ లేదా ఛైర్మన్‌దే. ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. రాజ్యాంగం స్పీకర్ నిర్ణయానికి కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని, ఆయా పార్టీలకు అనుకూలంగా స్పీకర్లు నిర్ణయాలను సంవత్సరాల తరబడి నాన్చుతున్నారు. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదే అయినా, వారు ఏదో ఒక పార్టీకి చెందినవారే. పదవిలో ఉన్నప్పుడు పార్టీకి రాజీనామా చేసే సంప్రదాయం భారత్‌లో లేదు. దీంతో సహజంగానే వారి నిర్ణయాలు అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా ఉంటున్నాయి. 1992 నాటి 'కిహోటో హోలోహాన్' కేసులో సుప్రీంకోర్టు ఒక చారిత్రక తీర్పునిచ్చింది. స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కోర్టులు జోక్యం చేసుకోకూడదని, నిర్ణయం వెలువడ్డాక మాత్రమే అది న్యాయ సమీక్షకు వస్తుందని చెప్పింది. ఇదే ఇప్పుడు స్పీకర్లకు కవచంగా మారింది. నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేయడం ద్వారా న్యాయస్థానాల పరిధిలోకి వెళ్లకుండా వారు తప్పించుకుంటున్నారు. కానీ, మణిపూర్ కేసులో స్పీకర్లు నిర్ణయం తీసుకోవడానికి సహేతుకమైన సమయం అంటే సాధారణంగా 3 నెలలు పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయినా, స్పీకర్లు కోర్టు ఆదేశాలను ఖాతరు చేయడం లేదు. "స్పీకర్‌ను ఆదేశించే అధికారం కోర్టుకు లేదు" అనే వాదనతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారు.చట్టసభల ప్రొసీడింగ్స్‌లో కోర్టులు జోక్యం చేసుకోకూడదని ఆర్టికల్ 212 చెబుతోంది. కానీ, ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నప్పుడు కోర్టులు మౌనంగా ఉండాలా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. స్పీకర్ల జాప్యం వల్ల ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఐదేళ్ల పదవీకాలాన్ని, మంత్రి పదవులను అనుభవిస్తున్నారు. ఇది ప్రజా తీర్పును అపహాస్యం చేయడమే. ఒకవేళ కోర్టులు స్పీకర్ అధికారాల్లో అతిగా జోక్యం చేసుకుంటే, భవిష్యత్తులో పార్లమెంటరీ వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు మధ్య ఆధిపత్య పోరు తీవ్రమై వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం ఉంది.ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ పరిరక్షణ జరగాలంటే ఆ 'సన్నని గీత'ను దాటి ఆలోచించక తప్పదు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి వేదికగా సరికొత్త రాజకీయ, న్యాయ పోరాటం మొదలైంది. వైఎస్ఆర్‌సీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికై, ఆ తర్వాత పార్టీకి, పదవికి రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. రాజీనామా లేఖపై నిర్ణయం తీసుకోవడంలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు చేస్తున్న కాలయాపనపై హైకోర్టు సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా నిర్ణయం తేల్చాలని ఆదేశించడంతో, ఈ అంశం ఇప్పుడు వ్యవస్థల మధ్య ఘర్షణకు దారితీస్తుందా అనే చర్చకు తెరలేపింది.పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జయమంగళ వెంకటరమణ గతంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరారు, ఆ తర్వాత రాజకీయ సమీకరణాల రీత్యా వైసీపీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం ఆయన తన రాజీనామా పత్రాన్ని మండలి ఛైర్మన్ మోషేన్ రాజుకు అందజేశారు. అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. రాజీనామా చేసి చాలా కాలం గడుస్తున్నా, ఛైర్మన్ దానిని ఆమోదించలేదు, అలాగని సాంకేతిక కారణాలతో తిరస్కరించనూ లేదు. ఫైలును పెండింగ్‌లో పెట్టేశారు. దీంతో వెంకటరమణ అటు మాజీ కాలేక, ఇటు పదవిలో కొనసాగలేక సతమతమవుతున్నారు. తన రాజీనామాను ఆమోదించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆయన హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది"స్పీకర్ లేదా ఛైర్మన్ రాజ్యాంగం కల్పించిన అధికారాలను దుర్వినియోగం చేస్తూ, నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా జాప్యం చేస్తే కోర్టులు జోక్యం చేసుకోవచ్చు" అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లు లేదా రాజీనామాలపై రీజనబుల్ టైమ్ (సాధారణంగా 3 నెలలు) లోపు నిర్ణయం తీసుకోవాలని గతంలో సూచించింది. ఏపీ హైకోర్టు కూడా ఇదే ప్రాతిపదికన 4 వారాల గడువు విధించినట్లు న్యాయ నిపుణులు భావిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ముందు మూడు దారులు ఉన్నాయి. 4 వారాల్లోగా రాజీనామాను ఆమోదించడం లేదా తిరస్కరించడం. ఇది జరిగితే సమస్య సద్దుమణుగుతుంది. లేదంటే శాసనసభల అధికారాల పేరుతో డివిజన్ బెంచ్‌కో, సుప్రీంకోర్టుకో వెళ్ళవచ్చు. అదీ కాదంటే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం. ఇది జరిగితే న్యాయస్థానధిక్కారం కిందకు వస్తుందా లేక శాసనసభల ఆధిక్యత నెగ్గుతుందా అనేది చూడాలి.మొత్తానికి, జయమంగళ వెంకటరమణ పిటిషన్ ఏపీ రాజకీయాల్లోనే కాకుండా, రాజ్యాంగపరమైన చర్చకు కూడా దారితీసింది. మండలి ఛైర్మన్ నిర్ణయంపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఆయనమౌనం వీడతారా లేక న్యాయ పోరాటానికి సిద్ధపడతారా అన్నది వేచి చూడాలి.చట్టసభల అధిపతులు తమ విచక్షణాధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నప్పుడు, న్యాయస్థానాలు కేవలం ప్రేక్షకుల్లా మిగిలిపోకూడదు. దీనికి శాశ్వత పరిష్కారం స్పీకర్ చేతిలో ఉన్న అనర్హత వేటు అధికారాన్ని తొలగించి, ఒక 'స్వతంత్ర ట్రిబ్యునల్‌కు అప్పగించడమే అని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

## బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ లో

# అన్ని రైళ్లను నిలపాలి...

## రైల్వే స్టేషన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలి..

### కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వినతి

### భువనగిరి డెవలప్ మెంట్ ఫోరం వినతితో స్పందించిన ఎంపీ - ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన బీడీపీ...




**న్యూఢిల్లీ, డిసెంబర్ 17, (తెలంగాణ దిశ):** భువనగిరికి అతి సమీపంలో ఉన్న బొమ్మాయిపల్లి రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లను ఆపాలని కోరుతూ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బుధవారం సమర్పించిన వినతి పత్రంలో కోరారు. భువనగిరి డెవలప్ మెంట్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ మెరుగు మధు మోహన్ విజ్ఞప్తి మేరకు రైళ్లను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సికింద్రాబాద్,గుంటూరు మార్గమధ్యంలో అనేక రైళ్లు బొమ్మాయిపల్లి రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. ఈ రైల్వే స్టేషన్ కు అతి సమీపంలో ప్రసిద్ధి చెందిన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని రోజుకు సుమారు లక్ష మంది సందర్శిస్తున్నారని వివరించారు. అదే విధంగా రైల్వే స్టేషన్ కు అతి సమీపంలో ఎయిమ్స్, శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉన్నాయని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు వైపుకు వెళ్లే రైళ్లను భువనగిరికి అతి సమీపంలోని బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్లో నిలపడం వల్ల భువనగిరి ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని వివరించారు.



అదే విధంగా బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ ను ఆధునీకరణతో పాటు అప్‌గ్రేడేషన్ చేయాలని, రెస్ట్ రూములు పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీరు, రిటైల్ స్టాల్స్, షాపింగ్ వంటి ప్రయాణికులు సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. దీంతో పాటు పార్కింగ్ స్టాండ్లను ఏర్పాటు చేయాలని కోరారు. బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడం వల్ల భువనగిరిలో రెండవ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసినట్లు అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా బీడీపీ అధ్యక్షులు డాక్టర్ మెరుగు మధు మోహన్ మాట్లాడుతూ తమ వినతికి స్పందించి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ లో రైళ్లను నిలపడంతోపాటు రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# డెంగీ లాంటి జ్వరమే 'స్క్రబ్ టైఫస్'





ప్రాణాంతక స్క్రబ్ టైఫస్ వ్యాధి విజృంభిస్తోంది. ఇది పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత కొన్ని రోజులుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఆసుపత్రుల్లో ఈ కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి అనంతపురం జిల్లాలో గవ్వల మధు అనే యువకుడు మృతిచెందిన విషయం తెలిసిందే. స్క్రబ్ టైఫస్ అనేది ఓరియంటియా సుట్సుగముషి అనే బ్యాక్టీరియాతో కలిగే వ్యాధి. చిగ్గర్ లేదా లార్వల్ మైట్ అనే చిన్న పురుగులు కుడితే వచ్చే జ్వరమిది. దీని భారినపడిన వారిలో తీవ్రజ్వరం, చలి, విపరీతమైన తలనొప్పి, దగ్గు జలుబు, ఒళు నొప్పులు, కండరాల నొప్పి, శరీరంపై దురద, ఎర్రని మచ్చలు, కళ్ల మంట, కోమా వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో రోగ నిర్ధారణ, యాంటీబయాటిక్ చికిత్స ప్రాణాంతక సమస్యలను నివారించడానికి చాలా ముఖ్యం. మనదేశంలో ఇటీవలకాలంలో విస్తరిస్తున్న జ్వరాల్లో 'స్క్రబ్ టైఫస్' ఒకటి. అయితే ఇది కొత్త వ్యాధేం కాదు. పాతదే. డెంగ్యూ జ్వరాన్ని పోలివుంటుంది. అయితే డెంగీ వైరస్ దోమల ద్వారా వ్యాప్తిస్తే ఈ జబ్బును కలుగజేసే రికెట్సియా (అంతర కణ బ్యాక్టీరియా) నల్లి లార్వాతో మనుషుల్లో చేరుతుంది. డెంగీ జ్వరానికి చికిత్స అవసరం లేని సందర్భాలు ఎక్కువ. అదే 'స్క్రబ్ టైఫస్' జ్వరాల్లో మాత్రం పదిమందిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మందిని ఇబ్బంది పెట్టొచ్చు. అందువల్ల ముందుగా గుర్తించి చికిత్సలు తీసుకోవటం చాలా ముఖ్యం. డాక్టరు సూచనలు పాటించి వైద్య సేవలు పొందించే ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు, విపరీతమైన చలిగాలులు ఉండటం వల్ల రాష్ట్రంలో ఈ వ్యాధి బాగా విస్తరిస్తున్నట్లుగా సమాచారం.

ప్రజలు అధైర్యపడకుండా ధైర్యంగా ఉంటే వ్యాధి నుంచి సులభంగా బయటపడొచ్చు. పీడితులకు సకాలంలో చికిత్స అందిస్తే మరణాల రేటు ఐదు శాతం లోపు ఉంటుంది. సకాలంలో చికిత్స అందకపోతే రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదముంది. పరిస్థితి తీవ్రతను బట్టి మరణాల రేటు 30 శాతం వరకు నమోదు కావొచ్చు. అనుమానిత కేసులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా రావడంతో నమూనాల సేకరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేస్తే ఫలితం ఉంటుంది. స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలి. మనుషుల నుంచి మనుషులకు ఈ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా, కీటకం కాటుకు గురైన వ్యక్తి అస్వస్థతకు గురవుతారు. అందుకే తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

అవగాహన ముఖ్యం : స్క్రబ్ టైఫస్ అనేది ఓరియెంటియా సుత్సుగాముషి అనే గ్రామ్-నెగటివ్ బాక్టీరియాతో వస్తుంది. ఇది కణాల లోపల జీవించే బాక్టీరియా. ఈ బాక్టీరియా సోకిన లార్వా ట్రోంబికులిడ్ నల్లి లార్వా (చిగ్గర్స్) ద్వారా వ్యాపిస్తుంది. ఈ నల్లులు సాధారణంగా పొదలు, పంటపొలాల్లోని మొక్కల మధ్య ఎక్కువగా కనిపిస్తాయి. స్క్రీక్రీకులిడ్ వ్యాప్తి చేసే చిన్న సాలీడు జాతికి చెందిన నల్లులు కుడితే వాటి లార్వా మనుషుల్లో వ్యాప్తి చెందుతుంది. కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొన్నాం. ఇది చాలా చిన్నదే. స్క్రబ్ టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. ది నల్లి (మైట్) కరిచినప్పుడు వస్తుంది. లక్షణాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటాయి. ఈవ్యాధి సాధారణంగా అటవీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో పొలాలున్న చోట్ల నివశించే వారిలో కొంతమేరకు కనపడుతుంది. శరీరంపై నల్లి కుట్టినప్పుడు ఆ భాగంపై ఏర్పడే నల్లని మచ్చతో పుండును 'ఎస్కార్' అంటారు. ఇది పెరిగి నొప్పులు ఏర్పడి జ్వరం, తలనొప్పి, కండరాలపై దద్దుర్లు, వాపు వంటివి కనిపిస్తాయి. వారం, పది రోజుల తర్వాత జ్వరం, వణుకు, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణ సంబంధిత సమస్యల రూపంలో ఇన్ఫెక్షన్ లక్షణాలు బయటపడతాయి. చాలామంది దీనిని సాధారణ జ్వరంగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. నల్లి కరిచిన తర్వాత, లక్షణాలు కనిపించడానికి ముందు 6 నుంచి 21 రోజుల వరకు ఇంక్యుబేషన్ కాలం ఉంటుంది.(సగటున 10 నుంచి 12 రోజులు) ఈ సమయంలో, బాక్టీరియా శరీరంలో వృద్ధి చెంది అనారోగ్యానికి గురౌతారు.

అప్రమత్తం కావాలి : తడి నేలలు, పొదలు, తోటలు, పొలాలు, పశువుల పాకలు, వ్యర్థాలు పోగుచేసే ప్రాంతాల్లో పనిచేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలి. పూర్తి చేతులున్న చొక్కా, ఫ్యాంట్లు, కాళ్లకు సాక్సులు, బూట్లు ధరించాలి. ఇళ్లల్లో పాత మంచాలు, పరుపులు, దిండ్లలోకి ఈ కీటకాలు చొరబడే అవకాశం ఉన్నందున వాటిని మార్చాలి. లేదంటే శుభ్రం చేశాకే వాడాలి. పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున, కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరుబయట ఆటలాడే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలి. ఎస్కార్, గజ్జల్లో, చంకల్లో, మెడమీద బిళ్లలు కట్టడం (లింఫాడెనోపతి) వంటి లక్షణాలతో ఈ వ్యాధిని నిర్ధారణ చేయొచ్చు. ఎస్కార్ : ఇది నల్లి కరిచిన ప్రదేశంలో ఏర్పడే కర్లి పొలుసుల గాయం. ఇది సాధారణంగా నొప్పిలేకుండా ఉంటుంది. లోపలున్న బ్యాక్టీరియా ప్రవేశించిన ప్రదేశాన్ని గుర్తించేదే 'ఎస్కార్'. వణుకుతో కూడిన అధిక జ్వరం ఉంటుంది. లింఫాడెనోపతి : ఎస్కార్ ప్రదేశానికి దగ్గరగా ఉన్న కణుపులు ఉబ్బడం సాధారణం. ఇతర ముఖ్యలక్షణాలు: తరచుగానూ, ఎక్కువరోజులపాటు జ్వరంగా ఉండటం.

# ఆ.. గ్రామాలకు మహర్దశ..!

**వరంగల్,తెలంగాణ దిశ :** వరంగల్ జిల్లాలోని నెక్కొండ మేజర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా మార్చాలని తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. నెక్కొండ తో పాటు మరో ఐదు గ్రామ పంచాయితీలను (అమీన్‌పేట, గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండ తండా, టీకే తండా) కలిపి కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ.. రాష్ట్రంలో మరొక కొత్త మున్సిపాలిటీ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. వరంగల్ జిల్లాలోని కీలకమైన నెక్కొండ మేజర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా మార్చాలని తెలంగాణ హైకోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో నెక్కొండ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ముందడుగు పడింది. నెక్కొండ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా గుర్తించాలని కోరుతూ మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. నెక్కొండ విస్తీర్ణం, జనాభా దృష్ట్యా దీనిని మున్సిపాలిటీగా మార్చాల్సిన అవసరం ఉందని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం..స్థానిక సంస్థల ఎన్నికలకోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి రానున్న నేప థ్యంలో కీలక ఆ దేశాలు ఇచ్చింది.మున్సిపాలిటీ ఏర్పాటుకు సంబంధి ంచిన నోటిఫికేష న్‌ను ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే వెంటనే జారీ చేయాలని హైకోర్టు.. ప్రభుత్వాన్ని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శా ఖను స్పష్టం చే సింది. ఈతాజా ఆదేశాలు నెక్కొండ ప్రాంతంలో పరిపా లనా సంస్కరణ లకు, అభివృద్ధికి త్వరలోనే బాటలు వేసే అవకా శం ఉంది.నెక్కొండను మున్సిపాలిటీగా మార్చే ప్రక్రియలో ఆరు గ్రామ పంచాయితీలనుకలపా లని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. నెక్కొండతో పాటు అమీన్‌పేట, గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండతండా, టీకే తండా గ్రామ పంచాయితీల ను కలిపి కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరారు. పిటిషనర్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం.. ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా గుర్తించడానికి సానుకూలత వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగాఒక ప్రాంతం మున్సిపాలిటీగా మారాలం టే.. దానికి తగినంత జనాభా, ఆదాయ వనరులు, చుట్టుప క్కల ప్రాంతాలతో అనుసంధానం ఉండాలి. నెక్కొండ ఈ అర్హతలను కలిగి ఉండటంతోనే హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అదనపు నిధులు, మెరుగైన పారిశుధ్య సేవలు అందుబాటులోకి వస్తాయి.హైకోర్టు ఆదేశాలతో నెక్కొండ ప్రజల ఆకాంక్షలు నెరవేరడం స్థానికంగా రాజకీయంగా ఒక విజయం. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే ఈ ప్రక్రియను ఎంత వేగంగా పూర్తి చేస్తాయనేది ప్రస్తుతం కీలకంగా మారింది. ఈ చర్య, రాబోయే స్థానిక రాజకీయాలలో ఒక కీలక పరి ణామంగా మారనుంది. మున్సిపాలిటీగా మారాక ఈ ప్రాంతం ము ఖచిత్రం పూర్తిగా మారే అవకాశం ఉంది.

# 9 వేల ఎకరాలకు మల్టీ-యూజ్ జోన్లు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టినహైద రాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ రాజకీయగా కలకలంరేపుతోంది. బీఆర్ఎస్,బీజేపీ నేతలు దీన్ని 5లక్షల కోట్ల స్కాంగా ఆరోపిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల 9,292 ఎకరాల ఇండస్ట్రియల్ భూములను మల్టీ-యూజ్ జోన్లుగా మార్చడం, సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ రేట్లలో కేవలం 30నుంచి 0శాతం చెల్లింపు తో రెగ్యులరైజేషన్ అనుమతి ంచడం ఈపాలసీలో కీలకం. అంటే హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. లోపలబాలనగర్, జీడిమెట్ల,సనత్ నగర్,ఆజమా బాద్ వంటి ప్రాంతా ల్లో22 ఇండస్ట్రి యల్ ఎస్టేట్లు,పార్కుల్లో 9,292 ఎకరాల భూముల ను మల్టీ-యూజ్‌జోన్లుగా అంటే రెసిడెన్షియల్, కమర్షియల్, మిక్స్‌-యూజ్‌మార్చ డానికి అనుమతించే పాలసీ. పాత ఇండస్ట్రియల్ క్లస్టర్లనుఆధునికీ కరించి,ఉపాధి,ఆర్థికాభివృద్ధికి అనుకూలంగా మా రుస్తమమని ప్రభుత్వం చెబుతోంది. భూమియజ మానులకు ఫ్రీహో ల్డ్ హక్కులు, మల్టీ-యూజ్ అనుమతులు ఇస్తారు. అప్లికేషన్లు 7 రోజుల్లో ప్రాసెస్, 7 రోజుల్లో అప్రూవల్, 45 రోజుల్లో పూర్తి రెగ్యులరైజేషన్ చేస్తారు. తెలంగాణలో పారిశ్రామిక సంస్థలకు ప్రభుత్వం భూములు 1960ల నుంచి ఇస్తున్నారు. హైదరాబాద్ స్టేట్ సమయ ంలో పారిశ్రామిక అభివృద్ధికి భూములు సబ్సిడీ రేట్లకు కేటాయించారు. అప్పట్లో పెట్టిన షరతు ప్రకారం వాటిని పారిశ్రామిక వినియోగానికి మాత్రమే ఉపయోగించాలి. 2 బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి భూములు 'ఫ్రీహోల్డ్'హ క్కులతో మార్చారు.

# ఈ కాయల గురించి మీకు తెలుసా..?

## ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..?



టొమాటోలను మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. ఏ కూర అయినా సరే టొమాటోలు లేనిదే పూర్తి కాదు. టొమాటోలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. అయితే టొమాటోల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో రామ ములక్కాయలు కూడా ఒకటి. ఇవి టొమాటోల మాదిరిగానే ఉంటాయి. కానీ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటాయి. ఇవి కూడా టొమాటోల జాతికి చెందినవే. రామ ములక్కాయలు మనకు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభిస్తుంది. సూపర్ మార్కెట్లు లేదా రైతు బజార్‌లలోనూ కొన్ని చోట్ల ఈ కాయలను విక్రయిస్తుంటారు. అయితే టొమాటోలలాగే రామ ములక్కాయలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కళ్ల ఆరోగ్యానికి..: రామ ములక్కాయలను తినడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ కాయల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఈ కాయలు ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, దయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే బీటా కెరోటీన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. లుటీన్ అనే మరో యాంటీ ఆక్సిడెంట్ కూడా ఈ కాయల్లో అధికంగానే ఉంటుంది. విటమిన్ ఎ, లుటీన్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. రామ ములక్కాయల్లో ఉండే నారింజైన్, నారింజెనిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. ఇవి కళ్ల వాపులను తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్‌ను అధిక మొత్తంలో పొందాలంటే ఈ కాయలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. పచ్చి వాటికన్నా ఉడకబెట్టిన కాయల్లోనే మనకు లైకోపీన్ అధిక మొత్తంలో లభిస్తుంది. లైకోపీన్ వల్ల గుండె కండరాల వాపులు రాకుండా అడ్డుకోవచ్చు. రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా నివారించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉ ండవచ్చు.

ఈ కాయల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రామ ములక్కాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ కొవ్వు మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు సైతం కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు సులభంగా తగ్గుతారు.

ఎముకల ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్ క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లైకోపీన్ వల్ల మహిళల్లో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. చర్మం లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు ఈ కాయలను మెత్తని పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఫేస్ ప్యాక్ చేసుకుంటే అందులో కాస్త తేనె కలపాలి. అదే జుట్టుకు వాడితే ఆ పేస్ట్‌లో కాస్త పెరుగు కలిపి వాడాలి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతాయి. ఇలా రామ ములక్కాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# ఈ అలవాటును తప్పించండి..

చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉ ంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో

ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్లు నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే




దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.

వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్లు చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి..

వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# దోమలను ఇలా తరిమేయండి..



ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువవుతోంది. తరచూ దోమలు కుడితే అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది. దీంతో చాలా మంది దోమల నివారణ కోసం రకరకాల మస్కిటో రిపెల్లెంట్లు, కాయిల్స్ వంటివి వాడుతుంటారు. ఇలాంటి కెమికల్ ఆధారిత నివారణలతో లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే ఈ దోమల బెడద నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధ చిట్కాలు పాటించటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని నిపుణులు చెబుతున్నారు.

దోమల నివారణ కోసం ఉపయోగించే మస్కిటో రిపెల్లెంట్‌లను శరీరానికి డైరెక్ట్‌గా అప్లై చేసుకోకూడదు. కొనే ముందు బాగా రీసెర్చ్ చేయాలి. ఉదయం-సాయంత్రం వేళ లాంగ్ స్లీవ్స్, షర్టులు, ప్యాంటులు, సాక్స్‌లు వేసుకోవటం ఉత్తమం. అలాగే, మస్కిటో నెట్‌లు కొనుక్కుని బెడ్ రూమ్‌లో పెట్టుకోవాలి. సిట్రోనెల్ల, లావెండర్, మారిగోల్డ్ వంటి మస్కిటో రెపెల్లెంట్ మొక్కలను ఇంట్లో ఏర్పాటు చేసుకోవటం వల్ల కూడా ఫలితం వుంటుంది. దాంతో పాటుగా ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి మడుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. దోమల బెడద ఎక్కువగా ఉన్న చోట ఫ్యాన్లు పెట్టుకోవాలి. దోమలు కొన్ని రకాల సువాసనలకు దూరంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి వాటిల్లో తులసి, వెల్లుల్లి, వేప నూనె, లవంగాలు, నిమ్మకాయ, ఉల్లిపాయ, ఆపిల్ సిడార్ వెనిగర్, యూకలిప్టస్ ఆయిల్, లావెండర్, పుదీనా వంటి సువాసనలకు దూరంగా పారిపోతాయి. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే మూలల్లో తరిగిన ఉల్లిపాయలను ఉంచటం వల్ల ఆ ఘాటైన వాసనకు దోమలు, ఈగలు ఆ దరిదాపుల్లో కనిపించవు.

# చేతులు కడుగుదాం ఇలా



చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ఇన్ఫెక్షన్లు, రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అయితే, దీని ప్రయోజనం అలా ఉంచితే చేతుల పరిశుభ్రత గురించి ఎన్నో అపోహలు ఉ ంటాయి. వాటిని నివృత్తి చేసుకుందాం.

గ్లవ్స్ తొడుక్కుంటే: ఎక్కువసేపు గ్లవ్స్ తొడుక్కోవడం వల్ల సురక్షితంగా ఉంటామని చాలామంది భ్రమలో ఉంటారు. నిజానికి గ్లవ్స్ తొడుక్కొని వస్తువులు ఇతరులకు ఇవ్వడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. వండుతున్నప్పుడు, ఏవైనా వస్తువులు పట్టుకొన్నప్పుడు గ్లవ్స్ వాడుతుంటారు. అయితే, గ్లవ్స్ విడిచిపెట్టిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాల్సిందే. అంతేకాదు గ్లవ్స్‌లో కూడా దుమ్ము, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి ఇతరులకు వ్యాపించవచ్చు. కాబట్టి, గ్లవ్స్ ధరించడం కంటే సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిది.

వేడినీళ్లు- చల్లనీళ్లు: హ్యాండ్ వాష్ పనితీరును నీటి ఉష్ణోగ్రత ఏమాత్రం మార్చదు. సూక్ష్మక్రిములు సబ్బు ప్రభావంతో చనిపోతాయి. నీళ్లు అవి వేడివైనా, చల్లటివైనా సబ్బు వదిలిపోవడానికే అని గుర్తుంచుకోవాలి. చేతులు కడుక్కునే విషయంలో చల్లటి నీళ్ల కంటే వేడి నీళ్లు ప్రయోజనకరమని శాస్త్రీయమైన ఆధారాలైతే లేవు.

శానిటైజేషన్-హ్యాండ్ వాష్: హ్యాండ్ వాష్ (సబ్బు) స్థానాన్ని శానిటైజర్ భర్తీ చేయదు. సబ్బుతో చేతులు కడుక్కోవడంతో వచ్చే ఫలితం శానిటైజర్ ద్వారా ఒనగూరదు. అన్ని సూక్ష్మక్రిములతో పోరాటానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం సమర్థంగా పనిచేస్తుంది. శానిటైజ్ చేసుకోవడం దీనికి ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి, చేతులను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల నుంచి తగిన రక్షణ లభిస్తుంది.

పద్ధతి అవసరం లేదా: చేతులను సరైన పద్ధతిలోనే కడుక్కోవాలి. అరచేతులు, వెనకభాగం, వేళ్ల మధ్య, బొటనవేలు, గోళ్ల భాగం, మణికట్టు ఇలా అన్ని భాగాలను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఆ తర్వాత శుభ్రమైన తువాలుతో తుడుచుకోవాలి. సరైన విధానం వైద్యుడి ద్వారా తెలుసుకొని ఆచరించడం మేలు.

వాష్‌రూం తర్వాత వంటకుముందు: వాష్‌రూంకు వెళ్లివచ్చిన తర్వాత, వంటకు ముందు చేతులు కడుక్కోవాలని సాధారణంగా అనుకుంటారు. అయితే ఇది పరిసరాల్లో మనం ముట్టుకునే వస్తువులను బట్టి ఆధారపడి ఉంటుంది. రైళ్లు, బస్సులు, బాగా జనం ఉన్న ప్రదేశాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు, తలుపు హ్యాండిల్స్, ఫర్నిచర్, స్విచ్చులు, లిఫ్ట్ బటన్లు ఇలా ఎక్కువమంది వాడే వస్తువులను పట్టుకొన్నప్పుడు, మీ ముఖం, కండ్లు, ముక్కు తాకిన సందర్భాల్లో, గ్లవ్స్ ధరించడానికి ముందు ఆ తర్వాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిందే.



# ఈ పండ్లను మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## వీటి లాబాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు..!


స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్ బెర్రీ.. ఇలా అనేక రకాల బెర్రీ పండ్ల గురించి మీరు వినే ఉంటారు. ఆయా పండ్లను చూసి కూడా ఉ ంటారు. కానీ మల్బెర్రీ పండ్లను మీరు ఎప్పుడైనా చూశారా..? ఈ పేరును చాలా మంది వినే ఉంటారు. కానీ ఈ పండ్లను చూసి ఉ ండరు. మనకు రహదారుల పక్కన లేదా స్టోర్స్‌లో మల్బెర్రీ పండ్లను బాక్సుల్లో పెట్టి విక్రయిస్తుంటారు. ఇవి ఎంతో తియ్యగా ఉంటాయి. చూసేందుకు ఆకర్షణీయంగా కూడా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మల్బెర్రీ పండ్లు సాధారణంగా తెలుపు, ఎరుపు, బ్లాక్ రంగుల్లో ఉంటాయి. అయితే ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మల్‌బెర్రీ పండ్లలో ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

రోగాలు రాకుండా రక్షణ..: రెస్వెరెట్రాల్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ బెర్రీ పండ్లలో అధికంగానే ఉంటాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాల నుంచి మనల్ని సురక్షితంగా ఉ ంచుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇదే పోషక పదార్థం రెడ్ వైన్‌లోనూ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. గుండె కండరాలు వాపులకు గురి కాకుండా చూస్తుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: మల్బెర్రీ పండ్లను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో 1-డిఆక్సీనోజిరిమైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కార్బొహైడ్రేట్లను శరీరం త్వరగా గ్లూకోజ్‌గా మార్చకుండా చూస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ పెరగవు, నియంత్రణలో ఉంటాయి. అందువల్ల దయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. మల్బెర్రీ పండ్లలో జియాజంతిన్, లుటీన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. కళ్లు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది.

క్యాన్సర్ రాకుండా..: మల్బెర్రీ పండ్లలో బయో యాక్టివ్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగాఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే ఆంథో సయనిన్స్, రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనాల్ల క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకో వచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ కె, క్యాల్షియం, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగామార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండ్లనతినడం వల్ల ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఇలా మల్బెర్రీ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సెగగడ్డలు బాధిస్తున్నాయా..



వేడి కారణంగా ఎక్కడపడితే అక్కడ సెగగడ్డలు వస్తుంటాయి. అవి వచ్చినప్పుడు తీవ్రమైన నొప్పి, బాధ ఉంటుంది. చాలా మంది ఈ బాధను తట్టుకోలేరు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే వీటి నుండి ఉపశమనం పొందాలంటే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి. సెగగడ్డలు రాకుండా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పండ్లను రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా చేయటం వల్ల బాక్టీరియా తగ్గుతుంది. రోజుకు 3 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి. కొబ్బరి నీళ్లు, జ్యూసులు, కూరగాయల రసాలను సేవించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయటం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్ళి పోతాయి. రక్తం శుద్ధి జరుగుతుంది. తద్వారా సెగగడ్డలు రాకుండా చూసుకోవచ్చు. తొక్క తీసిన నాలుగు వెల్లుల్లి రెబ్బలు, అరస్పూన్ వాము కలిపి మెత్తని పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ని సెగగడ్డలు ఉన్న ప్రదేశంలో రాసి పది నిమిషాలు అయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు స్పూన్ల బియ్యంపిండి వేసి దానిలో నీటిని కలిపి పొయ్యి మీద పెట్టి ఉడికించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సెగ గడ్డలపై రాయాలి. పూర్తిగా ఆరనివ్వాలి అనంతరం చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. కలబంద జెల్‌లో కొద్దిగా పసుపు కలిపి. గడ్డలపై అప్లై చేయాలి. ఆరిన తర్వాత చల్లని వాటర్‌తో శుభ్ర పరుచుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# నారాయణ... నారాయణ



**నెల్లూరు,తెలంగాణ దిశ :**ఏపీ రాజకీయాల్లో పిఠాపురం నియోజకవర్గం ఎప్పుడూ హాట్ టాపిక్ గానే ఉంటుంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మనుఉద్దేశించి మంత్రి నారాయణ చేసినట్లుగా భావిస్తున్న 'జీరో' వ్యాఖ్యలు టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గెలుపు కోసం తన సీటును త్యాగం చేసిన వర్మకు, జనసైనికులు, కొందరు కూటమి నాయకుల నుంచి ఇప్పటికే అవమానాలు ఎదురవుతున్నాయి. తాజాగా మంత్రి నారాయణ వ్యాఖ్యలతో పిఠాపురం టీడీపీలో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరింది. పిఠాపురం టీడీపీలో వర్మ బలమైన నేతగా గుర్తింపు పొందారు. గతంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రికార్డు ఆయనకుంది. 2024 ఎన్నికల్లో కూటమి ఒప్పందంలో భాగంగా ఈ సీటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటాయించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాలు, ముఖ్యంగా ఎమ్మెల్సీ పదవి హామీతో వర్మ తన సీటును త్యాగం చేశారు. పవన్ కల్యాణ్ విజయంకోసం ఆయన, ఆయన అనుచరులు క్రియాశీలకంగా పని చేశారు. అయితే, ఎన్నికల ఫలితాల తర్వాత పిఠాపురంలో టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య సమన్వయం లోపించింది. ముఖ్యంగా వర్మకు, ఆయన అనుచరులకు జనసైనికుల నుంచి సరైన గౌరవం దక్కలేదనే ఆరోపణలు వచ్చాయి. జనసేన నేత, పవన్ సోదరుడు నాగబాబు వంటి నాయకులు సైతం పరోక్షంగా వర్మను ఉద్దేశించి సెటైర్లు వేయడం ఈ వివాదానికి ఆజ్యం పోసింది. అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి వర్మ మౌనం వహించినప్పటికీ, ఆయన వర్గీయుల్లో అసహనం పెరిగింది., మంత్రి నారాయణ కొందరితో మాట్లాడినట్లుగా చెబుతున్న ఒక ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఆడియోలో, పిఠాపురంలో కూటమిలో జరుగుతున్న అంతర్గత విభేదాల గురించి ప్రస్తావిస్తూ? "వర్మ చాలా దూకుడు ఉన్న వ్యక్తి. పవన్ కల్యాణ్ గెలిచిన తర్వాత, మన పార్టీ నేత (వర్మ)తో వాళ్లకు (జనసైనికులకు) ఘర్షణ జరుగుతోంది. గత మూడు నాలుగు నెలల నుంచి అతన్ని (వర్మను) జీరో చేశాం" అన్నట్టుగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు వర్మకు తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. తాను చంద్రబాబు, లోకేశ్‌ల ఆదేశాల మేరకే మౌనంగా ఉన్నానని, పార్టీ బలోపేతం కోసమే ఎటువంటి విమర్శలకూ సమాధానం చెప్పడం లేదని వర్మ స్పష్టం చేశారు. "ఎవడో కర్మ అంటే నాకేంటి, ఎవడో గడ్డిపరక అంటే నాకేంటి. వర్మ అంటే ఏమిటో పిఠాపురం ప్రజానీకానికి తెలుసు" అంటూ మంత్రి నారాయణపై పరోక్షంగా సెటైర్లు వేశారు. తాను టీడీపీలో పిల్లర్ లాంటి వాడినని కూడా స్పష్టం చేశారు. వివాదం పెద్దదై, కూటమిలో ప్రకంపనలు సృష్టించడం తో మంత్రి నారాయణ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తన మాట లను వక్రీకరించారని, తాను పిఠాపురంలో టీడీపీ, జనసేన మధ్య ఉన్న విభేదాలను 'జీరో' చేశామని మాత్రమే చెప్పానని వివరణ ఇచ్చు కున్నారు. సోషల్ మీడియాలో కట్ అండ్ పేస్ట్ చేసి ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ అంశంపై విశాఖ పర్యటనలో ఉన్న మంత్రి నారా యణను వర్మ కలిసి చర్చించారు. ఈ భేటీ తర్వాత వర్మ మాట్లాడుతూ.. మంత్రి నారాయణపై వస్తున్న వార్తలు అసత్య ప్రచారాలని కొట్టిపారే శారు. పేటీఎం బ్యాచ్ చేసే అసత్య ప్రచారాలను నేను పట్టించుకోనని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన సమన్వయంతోనే పనిచేస్తున్నాయని, మంత్రి నారాయణ కాకినాడ జిల్లాలో వారధిగా పనిచేస్తున్నారని వర్మప్రకటించడం గమనార్హం. మొత్తంగా, మంత్రి నారాయణ వ్యాఖ్యలు కూటమిలోని వర్గపోరును ముఖ్యంగా టీడీపీ పరిస్థితిని మరోసారి బట్టబయలు చేశాయి. వర్మ త్యాగాన్ని కొందరు నాయకులు తేలికగా తీసుకుంటున్నారనే భావన టీడీపీ శ్రేణుల్లో బలపడింది. హైకమాండ్ జోక్యంతో ఈ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినప్పటికీ, వర్మ విషయంలో అధిష్ఠానం హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి, ఆయనకు దక్కాల్సిన గౌరవం లభించకపోతే పిఠాపురం టీడీపీలో అసంతృప్తి రాజుకునే ప్రమాదం లేకపోలేదు. ఈ పరిణామాలు కూటమి సమన్వయానికి సవాల్‌గా నిలుస్తున్నాయి.

# క్వాసీమూన్.. భూమికి కొత్త అంతరిక్ష సహచరుడు

## భూమికి రెండో చంద్రుడు!

## గుర్తించిన నాసా.. 2083 వరకు మనతోనే

న్యూఢిల్లీ: భూమికి ఒక కొత్త అంతరిక్ష సహచరుడు దొరికాడు. భూమికి దీనిని రెండో చంద్రుడిగా చెప్తున్నప్పటికీ ఇది నిజమైన చంద్రుడు కాదు. అయినప్పటికీ భూమిలాగే సూర్యుడి చుట్టూ దాదాపు ఒకే కక్ష్యలో పరిభ్రమిస్తున్న అరుదైన గ్రహశకలంగా నాసా గుర్తించింది. దీనికి '2025 పీఎన్7'గా పేరు పెట్టింది. యూనివర్సిటీ ఆఫ్ హవాయి గుర్తించిన ఈ గ్రహశకలాన్ని నాసా అధికారికంగా 'క్వాసీమూన్'(పాక్షిక చంద్రుడు) గా ధ్రువీకరించింది. ఇది 18 నుంచి 36 మీటర్ల వెడల్పుతో దాదాపు ఒక చిన్న భవనం అంత ఎత్తు ఉంది. అంతరిక్ష ప్రమాణాలప్రకారం ఇది చిన్నదే అయినప్పటికీ భూమికి పొరుగునే ఉండటం విశేషం. ఇది మన చంద్రుడిలా భూమి గురుత్వాకర్షణ శక్తికి లోను కాలేదు. కాకపోతే ఒకే ట్రాక్‌పై మనతో పరుగు తీస్తున్న 'స్నేహపూర్వక రన్నర్'లా ఉందని శాస్త్రవేత్తలు పోల్చారు. సూర్యుడి చుట్టూ తిరిగేటప్పుడు ఇది భూమిని అనుసరిస్తున్నట్టు కనిపిస్తుంది. '2025 పీఎన్7' గత 60 సంవత్సరాలుగా భూమితో దాదాపు ఒకే వేగంతో, ఒకే కక్ష్యలో ప్రయాణిస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత కక్ష్య



స్థిరంగా ఉంటే 2083 వరకు ఇది మనతోనే ఉంటుంది. ఆ తర్వాత ఇది అంతరిక్షంలోకి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఇది మన భూమికి అత్యంత దగ్గరగా వచ్చినప్పుడు 40లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇది మన చంద్రుడి దూరం కంటే 10 రెట్లు ఎక్కువ. సూర్యుడు, ఇతర గ్రహాల గురుత్వాకర్షణ ప్రభావం వల్ల ఇది 1.7 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించగలదు. క్వాసీ మూన్స్ చాలా అరుదైన వి. ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు కేవలం ఎనిమిదింటిని మాత్రమే గుర్తించారు. ఈ గ్రహశకలాలు గతిశీలతను, అంతరిక్షంలో భూమి గురుత్వాకర్షణ ప్రభావాన్ని తెలుసుకునేందుకు ఉపయోగపడతాయి.

# మహిళలను ఉగ్రకుట్రలోకి లాగే యత్నం


## ఉగ్రవాదంపై జైషే ఆన్‌లైన్ కోర్సులకు ప్లాన్

## పలు జాతీయ మీడియాల్లో కథనాలు

ఇస్లామాబాద్: మహిళలను మతపరమైన ఉగ్రవాదంలోకి లాక్కొచ్చేందుకు జిహాదీ గ్రూపులు కొత్త స్కెచ్ వేస్తున్నాయి. దీంతో తమ ఉగ్రముఠాను విస్తరించాలన్న కుట్రలతో పనిచేస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేం దుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటుచేసిన ట్లు ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషేమహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులునిర్వహించనున్నట్లు నిఘావర్గాలను ఉటంకిస్తూపలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్‌అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చెలెళ్లుసాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్ లోనిజైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సులో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి. ఈమహిళ బ్రిగేడ్‌లోజైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించు కున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8 నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చెలెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులుమహిళలకుపాఠాలు బోధిస్తారని నిఘావర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసంమహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంతమొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతోజమ్మూకశ్మీర్, యూపీవంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# 300 ఇళ్లు...350 సర్కార్ కొలువులు

**కడప,తెలంగాణ దిశ :**కడపలోని పెద్ద తండా గ్రామం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. 300 ఇళ్లున్న ఈ మారుమూల తండాలో.. ఒక్కరు ఇద్దరూ కాదు..ఏకంగా 350 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతం నుంచి వచ్చిన ఈ తండా వాసులు విద్య విలువను గుర్తించి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారు. పేదరికాన్ని జయించి, బాగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. ఇళ్ల కన్నా.. ఎక్కువ సంఖ్యలో ఉద్యోగస్తులు ఉండటం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. కొన్నాళ్ల క్రితం వరకు కూడా ఊరికో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే చాలా గొప్పగా భావించేవారు. అయితే ఇప్పుడు చాలా మంది యువత ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకుని ఆదిశగా కష్టపడుతున్నారు. కనుక ప్రతి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే గ్రామం మాత్రం వీటన్నింటికి భిన్నం. ఇక్కడ మొత్తం ఇళ్ల సంఖ్య 300అయితే ఉద్యోగాలు చేసేవారి సంఖ్య.. 350. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే అధికం. అవును మీరు విన్నది నిజమే. ఇక్కడి చాలా ఇళ్లలో తప్పనిసరిగా ఓప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. కొన్ని ఇండ్లలో ఇద్దరు, ముగ్గురు కూడా ఉన్నారు. మరి ఇంత మంది ప్రభుత్వ కొలువులు సాధించారంటే ఇదేదో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం, పట్టణాలకు దగ్గరగా ఉన్న ప్రాంతంఅనుకుంటే పొరపాటే. ఇదొక మారుమూల తండా. కనీస సౌక ర్యాలకు ఆమడ దూరంలో ఉంది ఈ తండా. ఇక్కడ నుంచి కాలేజీకి వెళ్లాలంటే.. 50 కిలోమీటర్లు ప్రయాణించాలి.




ఇంటికి దగ్గర్లోనే బడి ఉన్నా.. చదువుకోమంటే బద్ధకించే వారు ఎందరో ఉన్నారు. కానీఈ తండా వాసులు మాత్రం అలా కాదు. వారికి చదువు విలువ తెలుసు. అందుకే గ్రామంలోని చాలా మంది బాగా చదువుకుని ప్రభుత్వ కొలువు సాధించి.. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇది చుట్టు పక్కల గ్రామాలకు ఆదర్శరంగా నిలుస్తుంది. సుమారు 40 సంవత్సరాల క్రితం ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. వైద్యం, విద్య తండావాసులకు అందని ద్రాక్ష. అలాంటి గ్రామం నేడు జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. ఊళ్లో ఇక్కడ సుమారు 300 గడపలు ఉంటే.. ఉద్యోగులు సుమారు 350 మంది ఉన్నారు. అటవీ ప్రాంతం కావడంతో ఈ గ్రామస్తుల పుర్వీకులు.. కట్టెలు కొట్టి, అడవిని నమ్ముకొని జీవనం సాగించేవారు అయితే తమలానే తమ పిల్లలు కష్టపడకూడదని భావించిన వారు.. పిల్లలను బాగా చదివించారు. పిల్లలు కూడా తల్లిదండ్రుల కష్టాన్నిఅర్థం చేసుకుని.. బాగా చదివారు.

# అలజడి రేపుతున్న కొలికపూడి

**విజయవాడ,తెలంగాణ దిశ :**టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మరోసారి అలజడి రేపారు. తిరువూరులో ఆయన మాట్లాడుతూ ఎంపీ కేశినేని చిన్నిపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు మరో సారి రచ్చకెక్కాయి. మరోవైపు కొలికపూడిపైటీడీపీ నేతలు ధ్వజమెత్తు తున్నారు. ప్రశాంతంగా ఉన్న తిరువూరులో కావాలనే కలకలం రేపుతున్నారని మండిపడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిని టార్గెట్ చేస్తూ కొలికపూడి తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ పదవులు అమ్ముకుంటూ అవినీతి పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో పార్టీ పదవులు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో లీడర్లు తిరిగే వాళ్లని ఇప్పుడు ఎంపీ కార్యాలయంలోనే కూర్చొని పదవులు డబ్బులు ఇచ్చే వాళ్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రేషన్ మాఫియా, ఇసుకు మాఫియా నడుపుతూ పార్టీ పదవులు అమ్ముకుంటున్నారని అన్నారు. ఎంపీ కార్యాలయంలోని మూల్పూరి కిశోర్ చేస్తున్న దందాతో పార్టీ నేతలకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ కార్యాల యం కేంద్రంగా సాగుతున్న దందాను అధినాయకత్వం దృష్టికి తీసుకె ళ్తామన్నారు కొలికపూడి. ఈ నెల 24న రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివా సరావును కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. తిరువురులో జరుగుతున్న పరిణామాలు వివరిద్దామని కార్యకర్తలకు సూచించారు. అయితే ఎంపీపై కొలికపూడి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. దీంతో కొలికపూడిపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో రాజకీయ అలజడి రేపుతున్నారని ఆగ్రహంతో ఉన్నారు. కొలికపూడి మద్యం దుకాణాల నుంచి నెల నెల వసూళ్లు చేస్తున్నారని, మట్టి మాఫీయను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులబదిలీల కోసంకూడా కొలికపూడిడబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూడా కొలికపూడి ఏదో రకంగా వార్తాల్లో ఉంటూ వస్తున్నారు.



# చెత్తతో కరెంట్ తయారీ



**తిరుపతి,తెలంగాణ దిశ:**తిరుపతిలో చెత్తతో కరెంటు తయారు చేసే ప్లాంట్ మళ్ళీ మొదలైంది! 2016లో ఆగిపోయిన ఈ ప్రాజెక్టును ఇప్పుడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ముందుకు తెచ్చింది. 33 ఎకరాల్లో 12 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు మంత్రి ఆదేశాలతో కసరత్తు చేస్తున్నారు. చెత్తను వేరు చేసి,మండించి, విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. దీనితోతిరుపతి చెత్త సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. తిరుపతి సమీపంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. 2016లో రూ.100 కోట్లతో 12 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్లాంట్ పెట్టాలని అనుకున్నారు. అప్పట్లో జిందాల్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కూడా జరిగింది. కానీ స్థలం దొరక్క ఆగిపోయింది.. దీంతో ఆ ప్రాజెక్ట్ అక్కడితో ఆగిపోయింది. ఇప్పుడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈ ప్రాజెక్టును మళ్లీ ముందుకు తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి క్లస్టర్ పరిధిలో 33 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని జులైలో ఆదేశాలు ఇచ్చింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ కూడా ఈ విషయంలో ఆలస్యం చేయొద్దని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్లాంట్ వస్తే తిరుపతిలో చెత్త సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. తిరుపతి సమీపంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తే.. ఈ ప్లాంట్‌లో, ముందుగా చెత్త బరువును తూకం వేస్తారు. ఆ తర్వాత, అందులోని లోహాలు, కరగని ప్లాస్టిక్, టైర్లు, గాజు వస్తువులు, భవనాల వ్యర్థాలు వంటి వాటిని వేరు చేస్తారు. మండేందుకు అనువైన చెత్తను ఒక నిల్వ కేంద్రంలో (స్టోరేజ్ పిట్) నింపుతారు. ఈ నిల్వ కేంద్రంలో ఏడు వేర్వేరు భాగాలు ఉంటాయి. ప్రతి రోజు ఒక భాగంలో చెత్తను నిల్వ చేయడం ద్వారా, దానిలోని తడి శాతాన్ని తగ్గిస్తారు . ఎనిమిదో రోజున, ఆటోమెటిక్ క్రేన్ల సహాయంతో స్టోరేజ్ పిట్ నుంచి చెత్తను బాయిలర్‌లోకి పంపుతారు. బాయిలర్‌లో చెత్తను మండించడం వల్ల అందులోని నీరు ఆవిరిగా మారుతుంది. ఈ ఆవిరి శక్తిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి అయిన విద్యుత్తును బాయిలర్ పక్కనే ఉన్న స్విచ్ యార్డుకు పంపిస్తారు. అక్కడి నుంచి, ఈ విద్యుత్తును ఏపీఎస్పీడీసీఎల్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. ఈ విధంగా, వ్యర్థాలను ఉపయోగకరమైన విద్యుత్తుగా మార్చే ప్రక్రియ జరుగుతుంది. ఈ పద్ధతి పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, విద్యుత్ అవసరాలను తీర్చడంలో కూడా సహాయపడుతుంది. చెత్తను వేరు చేయడం, నిల్వ చేయడం, ఆపై మండించి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. చెత్తను బాయిలర్‌లో కాల్చినప్పుడు, వెలువడే వాయువులను ఫ్లూగ్యాస్ క్లీనింగ్ పద్ధతిలో శుద్ధి చేస్తారు.

ఈ ప్రక్రియలో స్లాక్డ్ లైమ్, యాక్టివేటెడ్ కార్బన్ వంటివి వాడతారు. శుద్ధి చేసిన వాయువులను 65 మీటర్ల ఎత్తులో ఉన్న పొగగొట్టం ద్వారా బయటకు వదులుతారు. చెత్తను కాల్చగా 14 శాతం ఫ్లైయాష్ మిగులుతుంది. ఈ ఫ్లైయాష్‌తో రోజుకు 7500 ఇటుకలు తయారు చేయవచ్చు. ఇలా చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణతో పాటు, ఇటుకల తయారీకి అవసరమైన ముడిసరుకు కూడా లభిస్తుంది.

కర్నూలు సభలో ఆసక్తికర సన్నివేశాలుతిరుపతి, చంద్రగిరి పరిసరాల్లో 12మెగావాట్లతో ఈ పవర్ ప్లాంట్ ప్లాన్ చేస్తున్నారు. రోజుకు 600 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు అవసరం అవుతాయి. తిరుపతి నగరంలో పోగయ్యే చెత్త 227 మెట్రిక్ టన్నులు ఉంటుంది. ప్లాంటుకు రోజుకు 90మెట్రిక్ టన్నుల చెత్త తరలిస్తారు.. మిగతాది తిరుపతి పరిసరాల నుంచి సేకరిస్తారు. ప్లాంటుకు రోజుకు 500 కేఎల్‌డీ నీళు అవసరం అవుతాయి అంటున్నారు. మొత్తం మీద పవర్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి.

## కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలి: డిజిఎం క్వాలిటీ

**కమాన్‌పూర్,తెలంగాణ దిశ:** కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలని రామగుం డం–3 ఏరియా క్వాలిటీ విభాగాధిపతి బి.వి సత్య నారాయణ అన్నారు. రామగుండం–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఆర్.జి–3, ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల కళాకారుల మధ్య రీజినల్ స్థాయిసాంస్కృతిక (కల్చరల్)పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలను రామగుండం–3 ఏరియా క్వాలిటీ విభాగా ధిపతి బి.వి.సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం వివిధ కళలకు సంబంధించిన పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ,నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండాకంపెనీ స్థాయి,కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు.

# హైదరాబాదీ రుచులకు గ్లోబల్ గుర్తింపు..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ప్రపంచంలోని ఉత్తమ 100 నగరాల జాబితాలో భారత్‌కు చెందిన నాలుగు ప్రధాన నగరాలు స్థానం దక్కించుకున్నాయి. వాటిలో బెంగళూరు, ముంబై, ఢిల్లీతో పాటు హైదరాబాద్ కూడా గ్లోబల్ టాప్-100లో నిలిచింది. సాంకేతిక విస్తరణ, ఆధునిక మౌలిక సదుపాయాలు, కార్పొరేట్ అవకాశాలు, నగర జీవనశైలిలో వేగవంతమైన మార్పులు.. ఇవి హైదరాబాద్‌కు ఈసారి కీలకమైన ప్లస్ పాయింట్లుగా మారాయి.

ప్రపంచ వ్యాప్తంగా బెస్ట్ నగరాల జాబితో బెంగళూరు 29వ స్థానం, ముంబై 40వ స్థానం, ఢిల్లీ 54వ స్థానం సాధించగా.. హైదరాబాద్ 82వ స్థానంలో నిలవగా.. దేశవ్యాప్తంగా నాల్గవ బెస్ట్ సిటీగా నిలిచింది. చెన్నై, కోల్‌కతా వంటి పాత మెట్రో నగరాలను వెనక్కు నెట్టి ఈ స్థానం పొందడం ప్రత్యేకంగా మారింది. హైదరాబాద్ కేవలం ఐటీ, బిజినెస్ హబ్ మాత్రమే కాదు..

ప్రపంచ ఫుడ్ మ్యాప్‌లో కూడా తనదైన స్థానం సంపాదిస్తోంది. 'టేస్ట్ అట్లాస్' విడుదల చేసిన టాప్ 100 టేస్ట్ సిటీల జాబితాలో హైదరాబాద్ 50వ స్థానంలో నిలిచింది. బిర్యానీ, ఇరానీ టీ, హలీమ్, ఉస్మానియా బిస్కెట్ ఇలాంటి వంటకాల ప్రత్యేక రుచులు ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ లవర్స్‌ను ఆకట్టుకుంటున్నాయి.

మొఘలాయి, అరబిక్, పర్షియన్, టర్కిష్ వంటకాల ప్రభావంతో హైదరాబాదీ ఫుడ్ కల్చర్‌కు ఈ గుర్తింపు మరింత బలం చేకూర్చిందిఇక ప్రపంచంలో టాప్-10 బెస్ట్ సిటీస్ సిటీస్ జాబితాకు వస్తే క్యాపిటల్ ఆఫ్ క్యాపిటల్స్'గా పేరున్న లండన్ మళ్లీ మొదటి స్థానాన్ని దక్కించుకోగా.. తర్వాతి స్థానాల్లో న్యూయార్క్, ప్యారిస్, టోక్యో, మాడ్రిడ్,సింగపూర్, రోమ్, బెర్లిన్ ఉన్నారు. అభివృద్ధి, వినోదం, పర్యాటకం, జీవనశైలి అన్ని విభాగాల్లో ఈ నగరాలు ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. భారతదేశంలో బెంగళూరు టాప్ లో నిలిచింది. టెక్ ఎకోసిస్టం, విస్తరించిన కార్పొరేట్ బేస్ వల్ల బెంగళూరు 29వ స్థానాన్ని సాధించింది. ఉద్యోగాలు, సాంస్కృతిక కార్యకలాపాలు, ఇన్నోవేషన్ కేంద్రంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై 40వ స్థానంలో నిలిచింది. రాజకీయ ప్రభావం, రవాణా కనెక్టివిటీ, అభివృద్ధి చెందుతున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా ఢిల్లీ 54వ స్థానంలో నిలిచింది. ఇక టెక్నాలజీ విస్తరణ, ఐటీ సేవల కేంద్రంగా ఎదుగుతున్న హైదరాబాద్ 82వ స్థానంలో సాధించింది. మరోవైపు.. దేశంలోనే పెద్ద సిటీగా హైదరాబాద్ నిలిచింది. మరోవైపు.. చెన్నై, కోల్‌కతా వంటి నగరాలనుసైతం పక్కన పెట్టి హైదరాబాద్ ముందంజలో నిలిచింది.రోజురోజుకూ హైదరాబాద్ గ్లోబల్ ఇమేజ్ మరింత బలపడుతోంది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వరుసగా మెరుగైన స్థానాలు సాధించడం హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిని మరో మెట్టుపైకి తీసుకెళ్తోంది. టెక్ సిటీగా గుర్తింపు, సురక్షిత నగరంగా పేరుగాంచడం, ఫుడ్ డెస్టినేషన్‌గా ఎదగడం హైదరాబాద్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. రాబోయే సంవత్సరాల్లో మరింత ఉన్నత స్థానాలను అందుకునే సామర్థ్యం నగరానికి ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# సంక్రాంతి బాదుడు షురూ..




**విజయవాడ,తెలంగాణ దిశ :** సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండటంతో ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు ఛార్జీలను విపరీతంగా పెంచుతున్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్ నుండి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి వంటి నగరాలకు వెళ్లే రైళ్లు, ఏపీఎస్ఆర్టీసీ బస్సులలో టిక్కెట్లు ఇప్పటికే అమ్ముడయ్యాయి. దీని వలన ప్రయాణికులు ప్రైవేట్ బస్సు సర్వీసులపై ఆధారపడవలసి వస్తోంది. ఇదే ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ దండుకుంటున్నాయి.రవాణా శాఖ, రైల్వే విభాగాలు ప్రత్యేక బస్సులు, రైళ్లను ప్రకటించడంలో ఆలస్యం చేస్తున్నాయని, దీని వలన ప్రైవేట్ బస్సుల టికెట్లకు డిమాండ్ మరింత పెరుగుతుందని కొందరు ఆరోపిస్తున్నారు. జనవరి 9, 10తేదీలు పండుగ సీజన్‌కు దగ్గరగా ఉండటంతో బుకింగ్‌లు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఛార్జీలు విపరీతంగా పెరిగాయి. ఏపీఎస్ఆర్టీసీ 50 శాతం గరిష్టంగా అదనపు పండుగ ఛార్జీలను వసూలు చేస్తుండగా, ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు రెండు నుండి మూడు రెట్లు ఎక్కువ ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఛార్జీలను పెంచడంపై పదేపదే ఫిర్యాదులు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై రవాణా శాఖ విమర్శలు ఎదుర్కొంటోంది. హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో ఏపీఎస్ఆర్టీసీ ఛార్జీ రూ.1,889 కాగా, ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు సీటర్‌కు రూ.5,000 నుండి రూ.5,999 వరకు, స్లీపర్ బెర్త్‌కు రూ.6,999 వరకు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం మధ్య ప్రయాణానికి ఏపీఎస్ఆర్టీసీ ఛార్జీ సూపర్ లగ్జరీ సర్వీస్‌కు రూ.1,032 నుండి స్లీపర్‌కు రూ.2,338 వరకు ఉంటుంది.

అయితే ప్రైవేట్ బస్సులు సీటర్ టిక్కెట్లకు రూ.2,599 నుండి రూ.4,999 వరకు, స్లీపర్‌కు దాదాపు రూ.5,999 వరకు వసూలు చేస్తున్నాయి.అదేవిధంగా హైదరాబాద్ నుండి విజయవాడకు ప్రయాణించే ప్రయాణీకులు సాధారణంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సులలో రూ.440 చెల్లిస్తారు. కానీ ప్రైవేట్ ఆపరేటర్లు సీటర్‌కు రూ.1,750 నుంచి రూ.1,790 మధ్య తీసుకుంటున్నారు. స్లీపర్‌లో రూ.3,500 నుంచి రూ.5,999 మధ్య ఛార్జీలను నిర్ణయించారు. హైదరాబాద్-బెంగళూరు మార్గంలో ఏపీఎస్ఆర్టీసీ స్లీపర్ టికెట్ ధర రూ.1,203, అయితే ప్రైవేట్ బస్సు ఛార్జీలు ఆపరేటర్‌ను బట్టి రూ.2,799 నుంచి రూ.6,899 మధ్య ఉంటాయి.

# శంషాబాద్ విమానశ్రయం మించి...బెజవాడ విమానశ్రయం



**విజయవాడ,తెలంగాణ దిశ :**విజయవాడ విమానాశ్రయంలో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు తుదిదశకు చేరాయి. గ్లాస్, స్టీల్ స్ట్రక్చర్‌తో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం 80 శాతం పూర్తయింది, మిగిలిన 20 శాతం పనులు మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అంతర్గత పనులు, ముఖ్యంగా ఇంటీరియర్ పనులు, టెర్మినల్ అభివృద్ధి చెందుతున్న సమయంలో, 40 కోట్లతో నిర్మించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్, ఏబీసీ కాంప్లెక్సులు అందుబాటులోకి వచ్చాయి. అలాగే, కొత్త ఆప్రాన్ పనులు కూడా పూర్తి అయ్యాయి, ఇవి భారీ విమానాలను పార్కింగ్ చేయడానికి అనుకూలంగా తయారయ్యాయి. గ్రాండ్ ఎంట్రన్స్ పనులు 95 శాతం పూర్తయ్యాయి, ఇక్కడకు చేరుకోవడానికి శంషాబాద్ తరహా మినీ ఫ్లైఓవర్ కూడా ఏర్పాటు చేయబడింది, ఇదిది కూడా దాదాపు 90 శాతం పూర్తయింది.విజయవాడ విమానాశ్రయ కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌లో దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల కోసం ప్రత్యేక చాంబర్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, అధికార కార్యాలయాలు, గెస్ట్ హౌస్, అరైవల్స్, డిపార్చర్స్, కస్టమ్స్, సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్, కమర్షియల్ బ్లాకులు వంటి అనేక సదుపాయాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా, సెంట్రలైజ్డ్ ఏసీ, పర్యావరణహిత విద్యుత్ వ్యవస్థలు, కన్వేయర్ బెల్ట్స్ వంటి ఆధునిక సదుపాయాలు టెర్మినల్‌లో ఏర్పాటు కానున్నాయి. వెయిటింగ్ ఏరియాలు, మూడు ఏరో బ్రిడ్జిల నిర్మాణం 90 శాతం పూర్తయ్యాయి, కాంక్రీట్ స్ట్రక్చర్ కూడా పూర్తి అయింది. వాటి మీదుగా ప్రయాణికులు విమానంలో నేరుగా ప్రవేశించవచ్చు.ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పనులన్నీ శరవేగంగా కొనసాగుతున్నాయి, మరిన్ని డిజైన్ పనులు ఈ నెల మూడో వారంలో చేపట్టనున్నారు అధికారులు. గార్డెనింగ్, అంతర్గత రోడ్లు, కార్ పార్కింగ్ ప్రాంతం కూడా సిద్ధమయ్యాయి, వీటిని సోలార్ ఎనర్జీతో సన్నద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందిచారు అధికారులు. ఇక మొత్తానికి ఈ నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే ఈ గన్నవరం ఎయిర్‌పోర్టు దక్షిణ భారతదేశంలో ఉన్న మరో ప్రధాన విమానాశ్రయాలో ఒకటా అవతరించనుంది

# పల్లెల్లో పండుగ 2.0




**నెల్లూరు,తెలంగాణ దిశ :**పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 4 వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించినట్లే, పల్లె పండగ 2.0లో రెండింతల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా 13,326 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగి స్తూ పల్లె పండగ 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పవన్ తెలిపారు. పల్లె పండగ 1.0 కార్యక్రమం ద్వారా రూ. 2,525 కోట్ల విలువైన పనులు టైం బౌండ్ విధానంలో పూర్తి చేశాం. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. పాడి రైతుల కోసం 22,500 మినీ గోకులాలు ఏర్పాటు చేశాం. మూగజీవాల దప్పిక తీర్చడానికి 15 వేల నీటి తొట్టెలునిర్మించాం. లక్షకు పైగా నీటి కుంటలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు పల్లె పండగ 2.0 కార్యక్రమంద్వారా రూ.5,838 కోట్లఅంచనా వ్యయంతో 8,571 కిలోమీటర్ల కొత్త రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు.పాత రహదారులకు పునర్నిర్మాణం చేయబోతున్నాం. రూ.375 కోట్ల వ్యయ ంతో 25 వేల మినీ గోకులాలు, రూ. 16 కోట్ల అంచనాతో 157 కమ్యూనిటీ గోకులాలు ఏర్పాటు చేస్తాం. రూ.4కోట్ల వ్యయంతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ. 406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డీపీఆర్సీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేయనున్నాం. వీటితోపాటు కోనసీమకు అదనంగా మరో రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనను ఒకసారి గుర్తు చేసుకుంటే గుంతలుపడ్డ రోడ్లు, మరమ్మతులు నోచుకోని కాలువలు, పాలనపై ప్రశ్నిస్తే పెట్టిన అక్రమ కేసులు గుర్తుకొస్తాయి. గత ప్రభుత్వం నుంచి మన ప్రభుత్వానికి వారసత్వంగా ఏదైనా వచ్చింది అంటే అవి అప్పులు, సమస్యలు మాత్రమే. గత ప్రభుత్వ హయాంలో నాయకుల దగ్గరకు వెళ్లి ఇది చేయండి అని అడిగే పరిస్థితి ఉండేది కాదు.మార్పు కావాలని యువత బలంగా తీసుకున్న నిర్ణయంతోప్రభుత్వం మారిపోయింది. అభివృద్ధి పనులకు వేల కోట్లు ఖర్చు చేయగలుగుతు న్నామని గుర్తుచేశారు. ప్రభుత్వంలా మేము దోచుకోవ డం లేదు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం లేదు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం లేదు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇస్తున్నాం. అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. పెన్షన్లు మీకంటే బలంగా ఇస్తున్నాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక తరహాలో ఇక్కడ విప్లవాలు వస్తాయని కొంతమంది నాయకులు కలలు కంటున్నారు. గత ప్రభుత్వం ఇంకో ఏడాది అధికారంలో ఉంటే అలాగే జరిగేది. కానీ అదృష్టవశాత్తు ఎలాంటి గొడవలు లేకుండానే ఓటు అనే ఆయుధంతో యువత ప్రభుత్వాన్నే మార్చేశారని అన్నారు.

# నీళ్లను రోజూ మరీ అతిగా, మోతాదుకు మించి తాగుతున్నారా..?

## అయితే ఏం జరుగుతుందో తెలుసా..?



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని వేళకు తీసుకోవడం, వ్యాయామం చేయడంతోపాటు రోజుకు తగినన్ని నీళ్లను కూడా తాగాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. నీళ్లను తాగడం వల్ల అనేక జీవక్రియలు సాఫీగా సాగుతాయి. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అయితే రోజుకు ఎవరైనా సరే కనీసం 2 నుంచి 3 లీటర్ల నీళ్లను లేదా 8 నుంచి 10 గ్లాసుల మేర నీళ్లను తాగాల్సి ఉంటుందని వైద్యులు మనకు సూచిస్తుంటారు. ఇది నిజమే అయినప్పటికీ మనం నివసించే వాతావరణ పరిస్థితులు, మన ఆరోగ్యం, ఉష్ణోగ్రత, శరీర బరువు, మనకు ఉండే వ్యాధులు వంటి అంశాలను ఆధారంగా చేసుకుని కూడా మనం రోజూ నీళ్లను తాగాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే వ్యక్తిని బట్టి రోజుకు తాగాల్సిన నీటి శాతం నిర్ధారించబ డుతుంది. అయితే నీళ్లను ఎవరైనా సరే తగిన మోతాదులోనే తాగాల్సి ఉంటుంది. అలా అని మరీ అతిగా తాగితే అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

**శరీరం వాపులకు గురై..:** నీటిని మరీ అతిగా తాగడం వల్ల శరీరంలో ద్రవాలు అధికంగా చేరుతాయి. దీని వల్ల శరీరంలో ఉండే ద్రవాల పరిమాణం మారుతుంది. ద్రవాల సమతుల్యత లోపిస్తుంది. దీంతో శరీరంలో లవణాల శాతం తగ్గుతుంది. ఫలితంగా ద్రవాలు ఎక్కువగా చేరి శరీరం వాపులకు గురవుతుంది. ముఖ్యంగా పాదాలు, కళ్లు, ముఖం, చేతులు వాపులకు గురై కనిపిస్తాయి. అలాగే కొందరికి వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి కండరాలు పట్టేస్తాయి. కండరాలు నొప్పులుగా ఉంటాయి. ముఖ్యంగా రాత్రి పూట ఇలా ఎక్కువగా జరుగుతుంది. రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోతుం టాయి. అలాగే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. చిన్న పనిచేసినా కూడా విపరీతంగా అలసిపోతారు.

**ఓవర్ హైడ్రేషన్..:** నీటిని సరిగ్గా తాగకపోతే ఏర్పడే స్థితిని డీహైడ్రేషన్ అంటారు. అదే నీటిని మరీ అతిగా సేవిస్తే ఏర్పడే పరిస్థితిని ఓవర్ హైడ్రేషన్ అంటారు. ఇవి రెండూ కూడా వాస్తవానికి ప్రమాదకరమే. ఈ రెండు సందర్భాల్లోనూ విపరీతమైన తలనొప్పి వస్తుంది. రక్తంలో ఉప్పు శాతం తగ్గుతుంది. దీంతో కణాలువాపులకు గురవుతాయి. దీని వల్ల ఒళ్లు నొప్పులు, వాపులు వస్తాయి. ఇక అధికంగా నీటిని తాగితే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల కండరాలు పట్టేయడం, నొప్పులు వంటి సమస్యలు వస్తాయి. కండరాల పనితీరు మందగించి కండరాలు బలహీనంగా మారుతాయి. నీటిని మోతాదుకు మించి సేవిస్తే కిడ్నీలపై భారం పడుతుంది. శరీరంలో అధికంగా ఉండే ద్రవాలను బయటకు పంపేందుకు కిడ్నీలు శ్రమించాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది కిడ్నీల డ్యామేజ్‌కు దారి తీస్తుంది. కనుక నీళ్లను మరీ అతిగా సేవించకూడదు.

**గుండెపై ప్రభావం..:** ఇక నీళ్లను మోతాదుకు మించి తాగడం వల్ల శరీరంలో పొటాషియం లెవల్స్ పడిపోతాయి. దీని వల్ల రక్త సరఫరా తగ్గుతుంది. బీపీ అసాధారణ రీతిలో పెరుగుతుంది. దీని ప్రభావం గుండెపై పడుతుంది. దీర్ఘకాలంలో ఇది హార్ట్ ఎటాక్‌కు దారి తీసే అవకాశం ఉంటుంది. అలాగే కాళ్ల నొప్పులు వస్తుంటా యి. తీవ్రమైన విసుగ్గా ఉంటుంది. మూడ్ మారుతుంది. ఎల్లప్పుడూ చిరాగ్గా ఉంటారు. కొందరికి ఛాతిలో తరచూ నొప్పి కూడా వస్తుంది. నీళ్లను మోతాదుకు మించి అతిగా తాగడం వల్ల ఎక్కువ సార్లు మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. రాత్రి పూట ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.

# మారుతోన్న పాకిస్తాన్ వైఖరి



లాహోర్, : పాకిస్తాన్.. ఇంతకాలం ఆఫ్గానిస్తాన్‌పై అనుకూల వైఖరితో ఉంది. తాము చెప్పినట్లు చేస్తుందని భావించింది. కానీ, కొన్ని నెలలుగా ఆఫ్గానిస్తాన్?భారత్ సంబంధాలు మెరుగుపడుతున్నాయి. దీనిని మన దాయాది దేశం జీర్ణించుకోలేకపోతోంది. అందుకే తెహ్రీక్ ? ఎ ? తాలిబార్ పాకిస్తాన్ ఉగ్రవాదుల సాకుతో ఆఫ్గాన్‌పై దాడులు చేస్తోంది. తాజాగా మరోమారు దాడికి తెగబడింది. గతంలో ఆఫ్గాన్ విదేశాంగ మంత్రితో భారత్‌లో ఉండగా పాకిస్తాన్ దాడులు చేపట్టింది, తాజాగా ఆఫ్గాన్ వాణిజ్య మంత్రి భారత్‌కు వచ్చిన సందర్భంలో చెప్పుకోదగ్గ ఈ దాడి దేశ మధ్య సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తోందని విశ్లేషకులు అంటున్నారు.ఆఫ్గాన్‌కు వైమానిక దళం లేదు. ఇదే అదునుగా గతంలో పాకిస్తాన్ వైమానిక దాడులు చేసింది. దీంతో పాకిస్తాన్ ప్రతిదాడి చేసింది. ఆఫ్గాన్ సైన్యాలు పాకిస్తాన్ సరిహద్దులోని పాకిస్తాన్ ట్యాంకులను అపహరించింది. 90 మంది పాకిస్తాన్ సైనికులను బంధించింది. దీంతో ఖతార్, టర్కీ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరిగేలా చూపాయి.ఇప్పటివరకు పాకిస్తాన్ వైమానిక దాడుల్లో 9 మంది పిల్లలు, ఒక మహిళ సహా మంది అమాయకులు మృతి చెందారు. ఈ దాడి వల్ల ఆఫ్గానిస్తాన్ తీవ్ర ఆగ్రహంతో ఎదురుదాడికి సిద్ధమవుతోంది. ఆఫ్గాన్ సంస్కృతిలో 'బాదల్' అనే రూల్, అంటే ప్రతీకారం తప్పనిసరిగా తీర్చుకోవాల్సిన విధానమని భావిస్తారు. మరో 'నాంగ్' రూల్ లో వ్యక్తి గౌరవం పట్ల హృదయపూర్వక కట్టుబాటు ఉంటుంది. ఈ సాంప్రదాయాలు పాకిస్తాన్‌కు కఠిన గుణపాఠాలు చెప్పడానికి ఆఫ్గాన్ సిద్ధమని స్పష్టంగా హెచ్చరించింది.ఆఫ్గానిస్తాన్ ? పాకిస్తాన్ సంక్లిష్ట సంబంధాలలో భారత్ కూడా కీలక పాత్ర పోషిస్తోంది. పాకిస్తాన్ దాడులు సాంకేతికంగా, సంప్రదాయికంగా భారత్‌తో క్షోభలు పెట్టే ఉద్దేశ్యంతో ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్‌కు సంబంధించి ఆఫ్గాన్ బాదల్, నాంగ్ నియమానుసారం సమర్థన ఇవ్వడం ద్వారా ఈ విషయంలో సమన్వయాన్ని పెంచుకోవాలి అని సూచనలున్నాయి.

# పత్తి రైతులపై నిబంధనల కత్తి?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నా మన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి.అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు..

ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర

ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవే టు వ్యాపారులే గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళ్లు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది. ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇతరరాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్‌తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండింప రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేవీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.



## కార్మెల్ ఉపాధ్యాయురాలికి అపూర్వ గౌరవం

మందమర్రి: కార్మెల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా సేవలు అందించి వేలాది మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఓఎం మేరీ రాసిన అక్షర పదాలను పుస్తకంగా ఆవిష్కరించి రచయిత్రి కావాలి అనుకున్న ఆమె చిరకాల స్వప్నాన్ని నెరవేర్చేందుకు పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో కార్మెల్ అకాడమీ వేదికగా మారింది. మందమర్రి పట్టణం కార్మెల్ అకాడమీలో 1994 సంవత్సరంలో విద్యను అభ్యసించిన కాంచనపల్లి రజిత, 1993 బ్యాచ్ కు చెందిన బస్వపత్రుని మోహన్, 1998 విద్యా సంవత్సరానికి చెందిన నల్లాల వినయ్ రాజేంద్రప్రసాదు 1999 బ్యాచ్ విద్యార్థి వినయ్ 1996 బ్యాచ్ ఒరిజో కంపెనీ అనిల్ కుమార్ మహేష్ 1994 బ్యాచ్ విశ్వాస్ ట్రస్ట్ కళ్యాణ్ తో పాటు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓఎం మేరీ రచించిన రూట్స్ ఆఫ్ జాయ్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి అకాడమీ ఫాదర్ జీవిఆర్ రెక్స్, థామస్ నిలయాని, జోసఫ్ కున్నత్, పూర్వ ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఎం మేరీ మాట్లాడుతూ రెండు సంవత్సరాలు రచించిన కథను పుస్తక రూపంలో అచ్చు వేయాలని పూర్వ విద్యార్థురాలు రజితకు తెలుపగా, మోహన్, వినయ్ రాజేంద్రప్రసాద్ ల సహకారంతో 300 పుస్తకాలు అచ్చు అయ్యాయని తెలిపారు. ఈ పుస్తకంలో కుటుంబ విలువలను, ప్రేమ అభిమానాలను తెలియజేస్తూ 12 అధ్యాయాలుగా విభజించి జీవితంలో ఆనందానికి మూలాలు కుటుంబం నుండి లభిస్తాయనే ముఖ్య అంశంతో పొందుపరిచినట్టు ఆమె వెల్లడించారు. ఉమ్మడి కుటుంబంలో పెరిగిన పిల్లలు తల్లిదండ్రుల పట్ల ప్రేమ గౌరవాలు ప్రదర్శిస్తూ, భావ స్వేచ్ఛ కలిగి, సంస్కృతిఈ సంప్రదాయాలు, పద్ధతులు నేర్చుకుంటూ ఉత్తమ బాటల వెంట ప్రయాణాలు కొనసాగించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు వద్దనుకుని వేరుగా ఉంటున్న తల్లిదండ్రులకు పిల్లల మధ్య పరస్పర అవగాహన కరువై మొబైల్ ఫోన్లకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కుటుంబం బాగుంటే సమాజంతో పాటు దేశం, ప్రపంచం బాగుంటుందని వివరించారు. ప్రతి కుటుంబంలో వృద్ధులతో కలిసి ఉంటే వారు అందించే అవగాహనతో ఆదర్శ కుటుంబంగా నిలుస్తార ని వెల్లడించారు. ఈ పుస్తక ఆవిష్కరణలో 200 మంది పైచిలుకు పూర్వ విద్యార్థులు పాల్గొనగా, ఈ పుస్తక ఆవిష్కరణ విజయవంతానికి సహాయ సహకారాలు అందించిన కార్మెల్ అకాడమీ ఫాదర్ జెవిఆర్ రెక్స్ కు పూర్వ విద్యార్థుల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్లాన్



**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్- 2026' కార్యక్రమాన్ని చేపట్టింది. 50 రోజుల ప్రణాళికతో కూడిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ బాషావిడుదల చేశారు. ఫిబ్రవరి 20 వరకు ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. సంకల్ప్ ప్రణాళిక ప్రకారం.. రోజూఉదయం 9.10 నుంచి 12.40 గంటల వరకు అన్ని సబ్జెక్టుల్లో బోధించని అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్, ఇతర టెస్టులు విద్యార్థులకు నిర్వహించాలి. డిసెంబరు 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహి స్తారు. ఆ తర్వాత డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు స్పెషల్ క్లాసులు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జూనియర్ కాలేజీల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని ఇంటర్ బోర్డు సూచించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026 మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు విద్యాశాఖ ఇటీవల షెడ్యూలు కూడా విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం పరీక్షలకు వంద రోజులు సమయం ఉంది. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడ ఉన్న వసతులపై విద్యాశాఖాధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు గతంలో కన్నా ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రతీరోజు తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి చదువుకోవాలి. ఏ సబ్జెక్టు అయినా రెండు లేదా మూడు భాగాలుగా విభజించుకోవాలి. పరీక్ష గడువు కాలాన్ని బట్టి కొంత సమయం రివిజన్‌కు కేటాయించి, మిగిలిన వాటిని పాఠ్యాంశాలు చదవడానికి కేటాయించాలి. రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు చదివి సాధన చేయాలి. చదివిన ప్రశ్నలను చూడకుండా రాయాలి. వేగంగా రాసే విధానం అలవాటు చేసుకోవాలి. బిట్‌పేపరుపై నిర్లక్ష్యం వదిలి క్షుణ్ణంగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.. ఈ మేరకు కార్యచరణతో వంద రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

## చేతికొస్తున్నపంటలకు దక్కని మద్దతు ధరలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పంట చేతికి వచ్చిన ప్రతీ సారి ఇబ్బంది పడుతున్నారు. మొదట తోతాపురి మామిడి కాయలకు డిమాండ్ లేక ఆందోళన చెందారు. తర్వాత ఉల్లి పంట పరిస్థితి అదే. ఇప్పుడు అరటి పంటలకూ డిమాండ్ ఉండటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో తోతాపురి మామిడి రైతులు ధరలు పడిపోవడంతో రూ.1,000 కోట్ల నష్టం చవిచూశారు. సెప్టెంబర్‌లో ఉల్లి ధరలు పడిపోయి, కర్నూల్, కడప జిల్లాల్లో రైతులు పంటను పారబోశారు. ఇప్పుడు అరటి పంటలకూ అదే పరిస్థితి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 18 ముఖ్య ఆహార పంటల్లో మామిడి, ఉల్లి, అరటి ప్రధానమైనవి. 2024-25లో మామిడి పంటలు అధిక ఉత్పత్తి ధరతగ్గుబాటు కారణంగా రైతులు భారీ నష్టం చవిచూశారు. ప్రభు త్వం కొంత సాయం చేసింది. సెప్టెంబర్‌లో ఉల్లి రైతులకు అదే సమస్య వచ్చింది.ఇప్పుడు అరటి రైతులు గగ్గోలు పెడుతున్నారు. డిమాండ్,ఎగుమతులు తగ్గడం, లోకల్ మార్కెట్ స్థిరత్వం లేకపోవడం వల్ల ధర పడిపోయాయి. 2025లో ఆంధ్రలో హార్టికల్చర్ పంటలు 30 శాతం పెరిగింది. కానీ మద్దతు ధర విధానం సరిగ్గా లేకపోవడం వల్ల రైతులు లాభాలు పొందలేకపోతున్నారు.

ఫలితంగా, రైతుల ఆదాయం 40 శాతం తగ్గిందని చెబుతున్నారు. సెప్టెంబర్ 2025లో ధరల పతనంతో రూ.50,000/ హెక్టారుకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. -24,000 మంది రైతులు ప్రయోజనం పొందారు.

నవంబర్ 2025లో మార్కెట్ ధరలు మెరుగుపడ్డాయి. జూలై 2025లో కేంద్రం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ఆమోదించి తోతాపురి రైతులకు రూ.1,490 క్వింటాల్ మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్రం రూ.4 కేజీ సబ్సిడీ మొత్తం రూ.260 కోట్లు ఇచ్చింది. అక్టోబర్ 2025లో రూ.172.84 కోట్లు 37,881 మంది రైతుల అకౌంట్లలో జమ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు ప్రధానంగా ప్రయోజనం పొందారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతు పథకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడం వంటి చర్యలు ప్రకటించింది. అరటి పంటలకు ఓఖ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామనిప్రకటించారు.

కానీ, ఇదంతా పేపర్ల మీదనే ఉన్నాయని రైతుల వరకూ వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీలు, కోల్డ్ స్టోరేజ్ సమస్యలు ఉండటంతో రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోతున్నారు. 2025లో హార్టికల్చర్ పంటలకు 1500 కోట్లు బడ్జెట్ కేటాయించినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో అమలు జరగడం లేదు. పంటలు అనూహ్యంగా ఎక్కువగా పండటం వల్ల ఇతర చోట్ల డిమాండ్ తగ్గిపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంత సాయం చేసినా రైతులు మాత్రం నష్టపోతూనే ఉన్నారు.

## 305 పరిశ్రమల మూసివేతలకు నోటీసులు!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించడంలో విఫలమైనం దుకు 305 పరిశ్రమలను మూసివేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశించింది. పర్యావరణ చట్టాల అమలును బలోపేతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతమైన కాలుష్య నియంత్రణను నిర్ధారించడం ఈ చర్య లక్ష్యంగా తెలుస్తోందికాలుష్య తీవ్రత ఆధారంగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్‌గా వర్గీకరిస్తుందని ఎఉ ఖఅః అధికారులు తెలిపారు. ఈ కేటగిరీల కింద తెలంగాణలో మొత్తం 12,264 పరిశ్రమలు ఉన్నాయి. ఈ వర్గీకరణకు అనుగుణంగా ఎఉఖఅః కొత్త, ఇప్పటికే ఉన్న పారిశ్రామిక యూనిట్లను నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు.జనవరి 2024 నుంచి అక్టోబర్ 2025 మధ్య బోర్డు 2,620 కొత్త కంపెనీల స్థాపనకు అనుమతులు మంజూరు చేసింది. వాయు, నీటి కాలుష్య నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని ధృవీకరించిన తర్వాత 3,521 యూనిట్లకు ఆపరేషన్ కోసం సమ్మతి (అఈూ) జారీ చేసిందిఇదే కాలంలో అధికారులు 2,069 పరిశ్రమలను తనిఖీ చేసి, కఠినమైన కాలుష్య నిర్వహణను నిర్ధారించడానికి ఉల్లంఘనలకు 1,234 యూనిట్లకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలను పాటించలేదని నిర్ధారించిన తర్వాత ఔషధ యూనిట్లు, ప్లాస్టిక్ పరిశ్రమలు, రసాయన కర్మాగారాలు సహా 305 పరిశ్రమలకు మూసివేత ఉత్తర్వులు జారీ అయ్యాయిఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ఎఉ ఖఅః టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 10741, 'జనవాణి - కాలుష్య నివారిణి' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. పారిశ్రామిక జోన్‌లలో రాత్రి పెట్రోలింగ్ కూడా చేస్తారు. బల్క్ డ్రగ్, రసాయన పరిశ్రమలలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్(జిఓఆ) వ్యవస్థలను కఠినంగా అమలు చేయడం, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం వంటి ప్రభావవంతమైన చర్యలు కాలుష్య తగ్గింపుకు దోహదం చేస్తున్నాయి501 అధిక కాలుష్య కారక పరిశ్రమల నుండి ఉద్గారాలను, కాలుష్య కారకాలను నిరంతరం ట్రాక్ చేయడానికి 24/7 ఆన్‌లైన్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్టుగా ఓ అధికారి తెలిపారు. కాలుష్య నిబంధనలను అధిగమించినందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ 108 పరిశ్రమలను సమీక్షించింది. తక్షణ దిద్దుబాటు చర్యలను ఆదేశించింది. నిరంతరం పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించింది.అయితే ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్(హిల్ట్) పాలసీని ఆమోదిస్తూ అధికారిక ఉత్తర్వు జారీ చేసింది. దీని ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల, చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగ జోన్లుగా అధికారికంగా మార్చడానికి వీలు కల్పిస్తుంది. హైదరాబాద్ సిటీ లోపల ఉన్న కాలుష్యకారక, ఔట్‌డేటెడ్ టెక్నాలజీతో నడుస్తున్న పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలిస్తారు. ఈ హిల్ట్ పాలసీ అమలులో భాగంగానే తాజాగా పరిశ్రమలపై ప్రభుత్వం ఫోకస్ చేస్తోందని కొందరు భావిస్తున్నారు.

## విలువలతో కూడిన జీవనమే పురోగతికి మార్గం


### – మండల విద్యాధికారి సురేందర్



**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** విలువలతో కూడిన జీవనమే పురోగతికి మార్గమని,విద్యార్థులు ఆదిశగా పయణించాలని మండల విద్యాధికారి సురేందర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు-2025 జిల్లా స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ సురేందర్, మాజీ ఎంఈఓ డానియల్, జిల్లా చెకుముకి కన్వీనర్ లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రీయ వైఖరిని అభివృద్ధి చేసుకోవాలని, మూఢనమ్మకాలు, డ్రగ్స్, బెట్టింగ్స్ వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. శాస్త్రీయ దృక్పథంతోనే మంచి పౌరులుగా ఎదగడం, పురోగతి సాధ్యమవుతుందని డానియల్ స్పష్టం చేశారు. అలాగే శాస్త్రీయ జ్ఞానంతో పాటు విలువలతో కూడిన జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాల ని లక్ష్మణ్ సూచించారు. జి ల్లాలోని 14 మండలాల నుండి మొత్తం 78 మంది విద్యార్థులు పాల్గొనగా, మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,మంథని జిహెచ్ఎస్ తెలుగు మీడియం,అంతర్గాం కేజీబీవీ రెసిడెన్షియల్, ప్రయివేటు పాఠశాలల నుండి సోక్రటిక్ హార్ట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ ఏడాది రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు డిసెంబర్ మూడో వారంలో కరీంనగర్ జిల్లాలోజరగనున్నాయని, జిల్లా విద్యార్థులు, ఉపాధ్యా యులు హాజరు కావాలని నిర్వాహకులు ఆహ్వానించారు. జిల్లా నలుమూలల నుండి పోటీలకు హాజరైన విద్యార్థుల కు భోజన వసతిని ఏర్పాటు చేసిన దేవేందర్ సింగ్‌కు నిర్వాహకులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు లు ఎస్.రత్నం, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి,జేవీవీ సభ్యులు షకీల్, జై.శ్రీ విష్ణు, స్వామి, ఎండి.రహీం, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నా రు.

# సినిమా..

## ఏంటి.. శర్వానంద్ ఇలా మారిపోయాడు..

యంగ్ హీరో శర్వానంద్ తన కెరీర్‌లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్నాడు. ఫ్యామిలీ, యూత్‌ఫుల్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఇటీవల 'మనమే' సినిమాతో ప్రేక్షకులని పలకరించాడు. ఈ సినిమా ఆశించిన స్థాయిలో హిట్ కాలేదు. ఇప్పుడు బౌన్స్ బ్యాక్ అవ్వాలని శర్వా ఫోకస్ పెట్టాడు. దీపావళి సందర్భంగా విడుదలైన తన కొత్త సినిమా 'బైకర్' టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అభిలాష్ కన్కరా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా ప్రశంసనీయమైంది. ఇటీవల విడుదలైన ఫోటోషూట్ చిత్రాల్లో షర్ట్‌లెస్‌గా కనిపించిన శర్వా తన సిక్స్‌ప్యాక్ యాబ్స్‌తో అందరినీ షాక్‌కు గురి చేశాడు. సాధారణంగా "చాకొలేట్ బాయ్" ఇమేజ్‌తో ఉండే శర్వా, ఈసారి మాస్ అండ్ ఇంటెన్స్ లుక్‌తో కొత్త ఇంప్రెషన్ సృష్టించాడు. ఫ్యాన్స్ సోషల్ మీడియాలో "శర్వా లుక్ మైండ్ బ్లోయింగ్!", "అనుకోని ట్రాన్స్‌ఫర్మేషన్!" అంటూ కామెంట్స్‌తో ముంచెత్తుతున్నారు. ఈ లుక్ కోసం శర్వానంద్ నెలల తరబడి కఠినమైన జిమ్ వర్కౌట్స్, కంట్రోల్డ్ డైట్ పాటించారని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఆ క్రమశిక్షణ, డెడికేషన్ ఫలితంగా ఈ ఫిట్ అండ్ ఫియర్స్ లుక్ వచ్చిందని ఫిట్‌నెస్ ఎక్స్‌పర్ట్స్ కూడా ప్రశంసిస్తున్నారు. ఇక శర్వానంద్ నటిస్తున్న బైకర్ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తోంది.


బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. జి. యువరాజ్ సినిమాటోగ్రఫీని అందిస్తుండగా, సంగీతం: ఘిబ్రాన్, ఎడిటింగ్: అనిల్ కుమార్ పి, ఆర్ట్ డైరెక్షన్: ఏ.పన్నీర్ సెల్వం, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్. సందీప్. శర్వానంద్ చివరిసారి సూపర్‌హిట్ అందుకున్నది "శతమానం భవతి", "మహానుభావుడు చిత్రాలతో. ఇప్పుడు 'బైకర్'తో మరోసారి మంచి హిట్ కొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఫస్ట్ లుక్‌తోనే పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసిన ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.

## స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?




ప్రభాస్‌హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమెఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## రష్మిక మందన్నా మైసా టీంతో ప్రభాస్ కల్కి 2898 ఏడీ స్టంట్ మాస్టర్


పుష్ప ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్ డమ్ సంపాదించింది కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా. ఈ భామ లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం మైసా. ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అంతేకాదు యాక్షన్ బ్లాక్స్‌పై పనిచేసేందుకు ఇప్పటికే ఆండీ లాంగ్ గ్యుయెన్ టీం కేరళలో ల్యాండింగ్ కూడా అయినట్టు సమాచారం. షూటింగ్ కూడా త్వరలోనే మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. Rawindra Pulle మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ విడుదల చేయగా.. గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని చెప్పకనే చెబుతోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నాను మరి కొత్త దర్శకుడు మైసా సినిమాలో ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?




ప్రముఖదర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విష యం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగాఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్పమార్పు చేయాలని నిర్ణయిం చుకున్నట్లు సమాచారం. ఈసినిమా పలుభాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మా త్రం'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతరఅన్ని భాషల్లో మాత్రం'వార ణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసేఅవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదంఎదుర్కోగా.. మేకర్స్‌ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దమణిగింది.

## అందుకే ఆ సినిమా ఒప్పుకున్నా..



జయాపజయాల సంగతి అటుంచితే.. మంచి నటిగా మాత్రం గుర్తింపు తెచ్చుకుంది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతికొద్ది సమయంలోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నది ఈ భామ. ఈ మధ్యకాలంలో విడుదలైన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి సినిమాలు అనుకున్నంతగా ఆడకపోయినా.. జాన్వీకి మాత్రం మంచి పేరే తెచ్చిపెట్టాయి. రీసెంట్‌గా కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఓ యాక్షన్ డ్రామాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది జాన్వీ. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధానపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో నటించేందుకు తానెందుకుఒప్పుకున్నానో తెలుపుతూ 'కేవలం రొమాంటిక్ పాత్రలే కాదు, ఏజానర్ సినిమాలైనాచేయగలనని నిరూపించుకోడానికే ఈ సినిమాకుసైన్ చేశాను. ఇది యాక్షన్,రివైంజ్, ఇంటెన్స్ డ్రామా. ఇందులో నాది స్ట్రాంగ్ క్యారెక్టర్. ఎనర్జీ, ఎమోషన్, మరింత బలంగా చూపించే అవకాశం ఈ పాత్రలో ఉన్నది' అని జాన్వీ తెలిపింది.


## మరో తెలుగు దర్శకుడితో?



తమిళ అగ్ర హీరో సూర్య తెలుగు సినిమాలపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయన వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. దీని తర్వాత మరో తెలుగు దర్శకుడి కథకు కూడా సూర్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఆ దర్శకుడెవరో కాదు, బ్లాక్‌బస్టర్ 'గీతగోవిందం' దర్శకుడు పరశురామ్. ఇటీవలే సూర్యకు పరశురామ్ ఓ కథ వినిపించారట. సూర్యకు కూడా కథ బాగా నచ్చడంతో నటించేందుకు ఓకే చెప్పారట. ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తారని సమాచారం.

ఇదిలా వుంటే, వెంకీ అట్లూరి సినిమా తర్వాత ఓ తమిళ సినిమాకు కమిటయ్యారు సూర్య. ఆ సినిమా తర్వాత పరశురామ్ సినిమా చేయాలని సూర్య భావిస్తున్నారట. అయితే.. పరశురామ్ మాత్రం వెంకీ సినిమా వెంటనే తన సినిమా చేయాలని పట్టుబడుతున్నాడని తెలుస్తున్నది.

## వారికంటే తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నా..



హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటిస్తూ ప్రేక్షకులను మైమరపించిన వారిలో ప్రియమణి ఒకరు. ఒకప్పటి హీరోయిన్ అయినప్పటికీ ఇప్పటికీ తన నటనతో ఇండస్ట్రీలో సత్తా చూపిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ చిత్రాలతో పాటు వెబ్‌సిరీస్‌ల్లోనూ నటిస్తోంది. త్వరలో 'ది ఫ్యామిలీ మ్యాన్-3' వెబ్ సిరీస్‌తో రాబోతుంది. ఈనేపథ్యంలో.. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ప్రియమణి ఇండస్ట్రీలో పరిస్థితుల గురించి షాకింగ్ విషయాలు బయటపెట్టింది. పారితోషికం, షూటింగ్ టైమింగ్స్ ఇష్యూపై స్పందించింది. "నేనెప్పుడూ రెమ్యునరేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదు. నాకున్న మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శక నిర్మాతలను అందుకు తగినట్లుగా పారితోషికం ఇవ్వమని అడిగేదాన్ని. చాలా సందర్భాల్లో నా తోటి నటించిన వారికంటే తక్కువ రెమ్యునరేషన్ తీసుకున్నాను. నా పాత్ర, నిడివి చూసుకొని సినిమాలను అంగీకరిస్తాను. కానీ డబ్బులు ఎంత ఇస్తున్నారనేది నేను పట్టించుకోను. ఆ పాత్రకు నేను అర్హురాలిని అని భావిస్తే మాత్రమే పారితోషికం పెంచమని డిమాండ్ చేసేదాన్ని అంతేకానీ అనవసరంగా ప్రతిసారి పారితోషికం పెంచమని కోరలేదు. ఇన్నాళ్లుగా నేను ఇండస్ట్రీలోని హీరోలకంటే నేను తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నా" అని చెప్పింది. అంటే అనవసరంగా కొంతమంది సెలబ్రిటీలు పారితోషికం పెంచమని అడుగుతున్నారని చెప్పకనే చెప్పింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215